ప్రజాశక్తి
ఆదివారం 5 మే 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ఉద్యోగులకు వల!

- పోస్టల్ ఓట్లపై వైసిపి, టిడిపి దృష్టి
- కొనుగోలుకు సన్నాహాలు
- ససేమిరా అంటున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోస్టల్ ఓట్లను వినియోగించుకుంటున్న ఉద్యోగులను తమకు అనుకూలంగా ఓటు వేయించుకునేందుకు వైసిపి, టిడిపి పావులు కదుపుతున్నాయి. పోస్టల్ ఓట్లకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను తీసుకున్న ప్రధాన పార్టీల వారు వారిని ఆకట్టుకునేందుకు అభ్యర్థులు వివిధ రూపాల్లో తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు అధికారులు గుంటూరు,పల్నాడు జిల్లాలోని ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో పోస్టల్ ఓట్లను వినియోగించకునేందుకు ఏర్పాట్లు చేశారు. 5, 6, 7, 8 తేదీల్లో పోస్టల్ ఓట్లను వినియోగించుకనేందుకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలుఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం అధికారుల పరిశీలన జరుగుతున్నా రహస్యంగా అభ్యర్థుల తరుపున కొన్ని బృందాలు వీరిని ఆకట్టుకునేందుకు నగదు, తాయిలాలు పంపిణీకి సన్నాహాలు చేస్తున్నారు.

పోస్టల్ ఓట్లు వినియోగించుకునే కేంద్రాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రం
తాడికొండ	గురుకుల బాలుర పాఠశాల,తాడికొండ
మంగళగిరి	నిర్మల హైస్కూలు, ఆత్మకూరు
పొన్నూరు	విఎన్ఆర్ కళాశాల చింతలపూడి
తెనాలి	రావిసాంబయ్యమునిసిపల్ హైస్కూలు తెనాలి
పత్తిపాడు	లయోలా పబ్లిక్ స్కూలు నల్లపాడు
గుంటూరుపశ్చిమ	ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల, సాంబశివపేట, గుంటూరు
గుంటూరుతూర్పు	ఎ.సి.కళాశాల, గుంటూరు
గురజాల	ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురజాల
మాచర్ల	జెడ్పి బాలికల ఉన్నతపాఠశాల, రైల్వేగేటు, మాచర్ల
వినుకొండ	లయోలాఉన్నతపాఠశాల, వినుకొండ
పెదకూరపాడు	జెడ్పి ఉన్నత పాఠశాల పెదకూరపాడు
చిలకలూరిపేట	జెడ్పి ఉన్నత పాఠశాల, గణపవరం
నర్సరావుపేట	ఎస్ఎస్ఎన్ కళాశాల, నర్సరావుపేట
సత్తెనపల్లి	జెడ్పి బాలికల ఉన్నత పాఠశాల, సత్తెనపల్లి

ఉద్యోగుల ఫోన్ పే నంబర్లను ముందే తెప్పించుకున్న అధికార పార్టీ నేతలు వారి అనుచరుల ద్వారా నేరుగా బ్యాంకుల్లో నగదు జమ చేస్తున్నామని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. గత ఐదేళ్లుగా తమ పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు వల్ల అసంతృప్తిగా ఉన్న కొంతమంది ఉద్యోగులు వైసిపి కార్యకర్తలు,నాయకులు పిలిచినా మొహం చాటేస్తున్నారు. కొంతమంది గత రెండురోజులుగా గుర్తు తెలియని నెంబర్ల ఫోన్లు కూడా లిఫ్ట్ చేయడంలేదు. ప్రధాన పార్టీలకు ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారడంతో ఎట్టిపరిస్థితుల్లో గెలవాలన్న తాపత్రాయంతో తమ గెలుపునకు పోస్టల్ ఓట్లు కూడా కీలకమని భావించి ఉద్యోగులకు ఎర వేస్తున్నారు. సామాజికవర్గాలకు చెందిన నాయకులు, ఉద్యోగ సంఘాలకు చెందిన నాయకులంతా రంగంలోకి దిగి తమకే ఓటు వేయాలని ఒత్తిడి తెస్తున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, మంగళగిరి, తాడికొండలో మన వాళ్ల అమ్మాయే ఈసారికి వీరికి చేయండి అంటూ తమకు ఫోన్లు వస్తున్నాయని కొంత మంది ఉద్యోగులు తెలిపారు. అంతర్గతంగా ఇప్పటికే కొంత మంది ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఆయా సామాజిక తరగతులు, వివిధ కులాలకు సంబంధించిన నాయకులను పిలిపించి మాట్లాడి ఈ సారికి మీరుమాకు చేయండి... మా ప్రభుత్వం వచ్చిన తరువాత మీకు ఇలా చేస్తాం... అలాచేస్తాం.. మీ సమస్యలను తీరుస్తామని చెబుతున్నారు. వైసిపి, టిడిపి అభ్యర్థులు, వారి అనుచరలు, బంధువులు ఉద్యోగులను ఆకట్టుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. వ్యక్తిగత అంశాలతో పాటు సామాజిక అంశాలపైనా నేతలు హామీలు గుప్పిస్తున్నారు. జిల్లాలో టిడిపి, వైసిపి తరుపున 80 శాతం మంది కార్పొరేట్, పలు వ్యాపార సంస్థలకు చెందిన శత కోటీశ్వరులు బరిలో ఉండటంతో డబ్బు పంపిణీకి వెనుకాడటం లేదు. మరోవైపు అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న ఉన్నతాధికారులూ కొంతమంది ఈసారికి ఇలా కానివ్వండి అంటూ సూచనలు చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ప్రభుత్వ సలహాదారుడుగా ఉన్నఉద్యోగ సంఘం నాయకుడు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి గుంటూరులో శనివారం మీడియాతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఉద్యోగులకు ఎంతో మేలు చేసిందన్నారు. ఈసారి ఎన్నికల్లో పోస్టల్ ఓటు ఉన్న ఉద్యోగులు వైసిపికి ఓటు వేయాలని బహిరంగంగా విజ్ఞప్తిచేయడం గమనార్హం.

జొన్నా శివశంకరరావుకు హారతులతో స్వాగతం పలుకుతున్న జనం

కమ్యూనిస్టులతోనే అభివృద్ధి

- డబ్బు మూటలతో వచ్చే నాయకులతో జాగ్రత్త..
- సిపిఎం మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావు
- యర్రబాలెంలో రోడ్‌షో - హారతులు, పూలమాలలతో స్వాగతం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకర్, గుంటూరు ఎంపీగా పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని యర్రబాలెంలో శనివారం రోడ్‌షో చేశారు. అభ్యర్థులకు స్థానికులు పూల మాలలు, హారతులతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ రాజధానికి గుప్పెడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చి 2014 నుండి బిజెపి అన్యాయం చేస్తూనే ఉందని, రాజధాని ద్రోహి అయిన బిజెపి 2024లో కూడా మొండి చేయి చూపించి ద్రోహం చేస్తారని అన్నారు. బిజెపితోపాటు ఆ పార్టీతో చేతులు కలిపిన టిడిపి, జనసేన, అంట కాగుతున్న వైసిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ ఎన్నికలకు కొత్త నాయకులు వస్తూ ఉంటారు పోతూ ఉంటారని, డబ్బు మూటలతో ఏమారుస్తూ ఉంటారని, వారితో జాగ్రత్తగా ఉండాలని కోరారు. నిమ్మగడ్డ రామ్మోహనరావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ ప్రాంత వాణిని అసెంబ్లీలో బలంగా వినిపించారని, కొన్ని వేల మందికి ఈ ప్రాంతంలో ఇళ్ల పట్టాలు ఇప్పిచ్చామని గుర్తుచేశారు. అభివృద్ధికి కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుంటారని, మూడు దశాబ్దాల క్రితమే పంచాయతీలో సిపిఎం అధికారంలో ఉండగా ఉండవల్లిలో జరిగిన అభివృద్ధి అందుకు నిదర్శనమని

▶ 2లో

ప్రదర్శనలో వామపక్ష శ్రేణులు

రాజకీయ ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

పల్నాడు జిల్లా ఎన్నికలాధికారి ఎల్.శివశంకర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు ప్రచురించే రాజకీయ ప్రకటనలకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) అనుమతి తప్పనిసరి అని పల్నాడు జిల్లా ఎన్నికలాధికారి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎంసిఎంసి ముందస్తు అనుమతి లేకుండా పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు ప్రింట్ మీడియాలో రాజకీయ ప్రకటనలను ప్రచురించకూడదన్నారు. గతంలో పలు సందర్భాల్లో ప్రింట్ మీడియాలో అభ్యంతరకరమైన, తప్పుదారి పట్టించే ప్రకటనలు ప్రచురితమైనట్లు గుర్తు చేశారు. వీటివల్ల ప్రభావితమయ్యే అభ్యర్థులు, పార్టీలకు వివరణ/ఖండన అందించే సమయం కూడా ఉండనందున ఎన్నికల చివరి దశలో ఇటువంటి ప్రకటనలు మొత్తం ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నట్లు ఎలక్షన్ కమిషన్ గుర్తించిందన్నారు. ఆవేశపూరితమైన, తప్పుదోవ పట్టించే, విద్వేషపూరిత ప్రకటనల కారణంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు

▶ 2లో

బంగారం, నగదు సీజ్

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘునకు సంబంధించి శనివారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేపట్టాయి. గుంటూరు తూర్పునియోజకవర్గ పరిధిలో రూ.18,30,000 విలువైన 278.9 గ్రాముల బంగారం, రూ.6,500 విలువైన 912 పార్టీ జెండాలు, మంగళగిరి నియోజకవర్గ పరిధిలో నైజ690 విలువ గల 0.75 లీటర్ల మద్యం, తెనాలి నియోజకవర్గ పరిధిలో రూ.2 లక్షలు నగదు సీజ్ చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకూ మొత్తం రూ.2 కోట్ల 99 లక్షల 83 వేల 697 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా

మాచవరం మండలంలోని పలు గ్రామాల్లో పల్నాడు ఎస్పీ పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ జి.బిందుమాధవ్

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎన్నికల నేపథ్యంలో వివాదాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ హెచ్చరించారు. మాచవరం మండల పరిధిలో సమస్యాత్మక గ్రామలైన పిన్నెల్లి, తురకపాలెం, కోటపాలెం, మొర్జంపాడు, పిల్లుట్ల, మల్లవోలు, కోటగణేశు నిపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ శనివారం సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా వినియోగించుకునేలా అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలను సాధారణ, సమస్యాత్మక, అతిసమస్యాత్మక అనే విధంగా విభజించి దానికి

▶ 2లో

హోమ్ ఓటింగ్‌లో అధికారుల నిమగ్నం

ప్రజాశక్తి- తెనాలి

ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధురాలు

పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులకు హోం ఓటింగ్ సౌకర్యాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిన నేపథ్యంలో పట్టణంలో ఆ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. అధికారులు ముందుగా గుర్తించిన ఓటర్ల ఇళ్ళకు వెళ్ళి, వారికి అవగాహన కల్పించి రహస్య బ్యాలెట్ ద్వారా ఓటు వేయిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి ప్రఖర్ జైన్ తెలిపారు. శనివారం ఒక్కరోజే 178 ఓట్లు పోలైనట్లు చెప్పారు. కార్యక్రమంలో హెూం ఓటింగ్ టీం పాల్గొన్నారు.

హెర్నియాపై వర్క్‌షాప్ విజయవంతం

ప్రజాశక్తి-తాడేపల్లి

మణిపాల్ హాస్పిటల్స్ అసోసియేషన్ ఆఫ్ వరల్డ్-రెనోవ్డ్ సర్జన్స్ కన్సార్టియం భాగస్వామ్యంతో ఈ నెల 3, 4 తేదీల్లో విజయవాడలోని హోటల్ తాజ్ వివంతాలో నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది. హెర్నియా రిపేర్ సర్జరీలకు సంబంధించి తాజా పురోగతులను అన్వేషించడానికి, వైద్యరంగంలో తమ నైపుణ్యాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి ఆసక్తి ఉన్న వైద్య నిపుణులు, ఎంతోమంది ఔత్సాహికులు ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. మణిపాల్ హాస్పిటల్స్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ సురేంద్ర జాస్తి మాట్లాడుతూ ఈ వర్క్ షాప్‌లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా దేశ నలుమూలల నుంచి సుమారు 200 మంది వైద్య నిపుణులు పాల్గొన్నారని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో దాదాపు 18 లైవ్ ఆపరేషన్లు (ఓపెన్, లాప్రోస్కోపిక్, రోబోటిక్) జరిగాయన్నారు. మణిపాల్ హాస్పిటల్స్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి వర్క్‌షాప్ ప్రాముఖ్యతను పునరుద్ఘాటించారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనే వారికి హెర్నియా శస్త్రచికిత్సలో తాజా ఆవిష్కరణలను ప్రత్యక్షంగా చూసేందుకు అవకాశం వచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా వైద్యరంగంలో ప్రముఖులైన వారిని కలిసి ఆలోచనలను పంచుకునేందుకు వర్క్‌షాప్ వేదిక అయిందన్నారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రాంగణ ఎంపికల్లో ఎఎం రెడ్డి ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దివీస్ ఫార్మా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ తమ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలు తమ కళాశాల విద్యార్థులు 43 మంది ఉద్యోగాలు సాధించారని ఎఎంరెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామ పరిధిలో తమ కళాశాలలో శనివారం దివిస్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్‌రావు మాట్లాడుతూ ఫార్మా రంగం లోని మార్పులకు అనుగుణంగా తమ కళాశాలలో విద్యా బోధన సాగిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల అకాడమిక్ డీన్ డాక్టర్ ఎం.లక్ష్మీ సురేఖ, దివిస్ లేబరోటోరిస్ ప్రాంగణ నియామకాల ప్రతినిధులు హరికృష్ణ, రామకృష్ణ, ప్రాంగణ ఎంపికల విభాగాధిపతి డాక్టర్ అశోక్, మురళీకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

శిక్షణలో పాల్గొన్న సిబ్బంది, పక్క చిత్రంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివ శంకర్, నియోజకవర్గ ఆర్‌ఒ పి.సరోజ

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో పోలింగ్ సిబ్బంది ఉదాసీనతను వదిలి ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి అన్నారు. శనివారం స్థానిక నరసరావుపేట లోని భువనచంద్ర టౌన్ హాల్లో నరసరావుపేట నియోజకవర్గ ఎన్నికల సిబ్బంది పిఓలు, ఏపీవోలు, ఓపిఓలు మరియు మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి శివ శంకర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ఉన్న కొన్ని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని, సాయుధ బలగాలను కూడా ఉంచడం జరిగిందన్నారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ స్టేషన్లలో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు ముందస్తుగా ఎవరికి తెలపాలి అనే విషయమై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈవీఎంలలో సమస్యలు ఉన్న ట్లయితే సంబంధిత సెక్టోరల్ ఆఫీసర్లకు తెలియజేయాలని అన్నారు. అదేవిధంగా లా అండ్ ఆర్డర్ విషయమై ఉదాసీనతను వదిలి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న పోలీసు సిబ్బందికి,వారిపైన అడిషనల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రెస్పాన్స్ టీంలు ఉంటాయని అన్నారు. గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా ఎన్ని కలు నిర్వహించాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు భయ భ్రాంతులను చేయడం వారిని తీసుకొనిపోవడం వంటి కార్యక్రమాలు జరిగినప్పుడు పోలింగ్ సిబ్బంది అప్రమత్త వ్యవహరించి తదనగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.సరోజ పోలింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలిస్తే మహిళలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం అందిస్తామని కూటమి తరుపున చిలకలూరిపేట టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు భార్య వెంకటకుమారి అన్నారు. పట్టణంలోని 34,35 వార్డులో శనివారం ఆమె తన కుమార్తె స్వాతితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఇందులో భాగంగా టిడిపి ఎన్నికల కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలతో ఓట్లేయించుకున్న వైసిపి తన పాలనలో వారిని విస్మరించిందని అన్నారు. టిడిపి హయాంలో ఎస్సీ, ఎస్టీలకు రాయితీ రుణాలు, ఇతర సాయాలు అందాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో కూటమిని గెలిపిస్తే స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రునాలు రూ.3 లక్షల నుండి 10 లక్షలకు పెంచుతారని, వ్యాపారం, స్వయం ఉపాధికి అవకాశం కల్పిస్తారని చెప్పారు. ఎమ్మెల్యేగా పుల్లారావును, ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

కార్పొరేషన్ల పేరుతో జగన్ మోసం : కన్నా

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కార్పొరేషన్ల పేరుతో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దళితులు, బీసీలు, మైనార్టీ లను మోసం చేశారని ఎన్‌డిఎ కూటమి తరుపున సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని త్రిపురాపురం, బాలాజీ తండా గ్రామాల్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. జగన్ విధ్వంస పాలన దెబ్బకు వందల కంపెనీలు ఏపీ నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయని, ఉద్యోగావకాశాల్లేక యువత నిరాశ నిస్పృహల్లో ఉన్నారని విమర్శించారు. అన్ని రంగాల్లో వెనబడిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే కూటమిని అధికారంలోకి తేవాలని అన్నారు. ఎమ్మెల్యేగా తనను, నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణదేవ రాయలుకు ఓటేయాలని అభ్యర్థించారు.

కమ్యూనిస్టులతోనే అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. కార్పొరేషన్ పేరుతో ఇంటి పన్నులు పెంచి, చెత్త పన్ను విధించి పాలకులు ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెట్టారని అన్నారు. తనని గెలిపిస్తే పన్నుల భారం తగ్గించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను బిజెపి ప్రవేశపెడితే దాన్ని వైసిపి తూచ తప్పకుండా అమలు చేసిందని, ఆ చట్టాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, కాంగ్రెస్ నాయకులు హనుమంతరావు, ఎ.వీరవెంకయ్య, సిహెచ్ సత్యనారాయణ, అంటోని, సిపిఐ తిరపతయ్య, జాన్‌బాబు, ఎస్.రామరాజు పాల్గొన్నారు.

రాజకీయ ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటోందన్నారు. రాజకీయ ప్రకటనలకు సంబంధించి దరఖాస్తును ప్రచురణ రోజుకు కనీసం 3 రోజులు ముందుగా ఉంటుందన్నారు. వార్తాపత్రిక ప్రకటనల ముందస్తు ధ్రువీకరణ ప్రక్రియను సులభతరం చేయడానికి, జిల్లా స్థాయిలో కమిటీలను అప్రమత్తం చేశామని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఇతర సంస్థల నుండి అందిన ప్రకటనలను కమిటీలు త్వరితగతిన పరిశీలించి, ధ్రువీకరిస్తాయని తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా

(మొదటి పేజీ తరువాయి)

తగ్గట్టు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎవరూ వివాదాల జోలికెళ్లొద్దని, ఇబ్బందులను కొనితెచ్చుకోవద్దని సూచించారు. ఎన్నికల నియమావళి గురించి వివరించి ఎక్కడైనా ఉల్లంఘన జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని లేదా 9440796184 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రభాకర్, సిసి కోటేశ్వరరావు, దాచేపల్లి సిఐ సురేంద్రబాబు, మాచవరం ఎస్ఐ అమీనుద్దీన్ ఉన్నారు.

సునీల్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సునీల్‌కు నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి

సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ సభ్యులు, పిడబ్ల్యుడి రిటైర్డ్ ఉద్యోగి చాట్రగడ్డ సుందరరావు పెద్ద కుమారుడు సునీల్ (39) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. సునీల్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉండవల్లిలోని స్వగృహంలో ఉన్న సునీల్ భౌతికకాయాన్ని పలువులు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. మంగళగిరి సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, రూరల్ కార్యదర్శి డి.వెంకట్ రెడ్డి, రాజధాని డివిజన్ నాయకులు ఈమని రామారావు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఎం.భాగ్యరాజు, ఎస్ ఇమ్మానియేల్ రాజు, ఎస్‌కె ఎర్రపీరు, పి.గాంధీ, పి రాఘవులు, కె.జగదీశ్వర్ రెడ్డి, పార్థసారథి, మస్తాన్‌రావు, టి.బక్కిరెడ్డి, ఆర్‌వి రాఘవయ్య తదితరులు సునీల్ భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కారంపూడిలో వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - కారంపూడి : మాచర్ల ఎమ్మెల్యేగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మరోసారి గెలిపించాలనిమాచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు కోరారు. ఈ మేరకు మాచర్లకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి నరసింహారావు కారంపూడిలో శనివారం ప్రచారం చేశారు. నరసరావుపేట ఎంపీగా అనిల్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలన్నారు. ప్రచారం అంకాళమ్మ గుడి వద్ద నుండి ప్రధాన విధి గుండా ఆర్యవైశ్య బజారు వరకు సాగింది.

రేపు మాచర్లకు సిఎం జగన్

ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం వైసిపి అధినేత, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాచర్లకు వస్తున్నారని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం కారంపూడిలో విలేకర్లతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 11 గంటలకు మాచర్లలోని రింగ్ రోడ్డు సెంటర్‌లో బహిరంగసభ ఉంటుందని, శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు.

వైసిపి తప్పుడు ప్రచారం : మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : తమ పార్టీ మేనిఫెస్టోపై వైసిపి తప్పుడు ప్రచారం చేస్తోందని ఆ పార్టీ గుంటూరు పశ్చిమ టిడిపి అభ్యర్థి గల్లా మాధవి అన్నారు. శనివారం రాత్రి గుంటూరు 28, 29వ డివిజన్‌లోని నల్లకుంటలో మాధవి ఎన్నికల ప్రచారం చేశారు. బిసి నాయకులు కుమ్మర క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పలువురు టిడిపికి మద్దతు పలికారు. గుంటూరు పశ్చిమలో వలస పక్షులకు స్థానం లేదని, బీసీలంతా గళ్ళా మాధవి వెంటే ఉంటామని చెప్పారు. శ్రీనివాసపేటలో మిర్చి యార్డ్ వైస్ చైర్మన్ యస్.యం సుభానితో పాటు 100 మంది టిడిపిలో చేరగా వీరికి మాధవి, మల్లెల రాజేష్ నాయుడు టిడిపి కండువాలు కప్పి హ్వానించారు. 32వ డివిజన్‌కు చెందిన కోటితో పాటు 50మంది వైసిపిని వీడి టిడిపిలో చేరారు.

మంగళగిరిలో బ్రాహ్మణి రోడ్‌షో

ప్రజాశక్తి-మంగళగిరి

ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి పట్టణంలో శనివారం రాత్రి నారా బ్రాహ్మణికి రోడ్ షో కార్యక్రమం జరిగింది .విక్టరీ సింబల్ చూపిస్తూ వైష్ణవి ఫంక్షన్ హాల్ నుంచి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వరకూ సాగిన ఈ రోడ్ షో లో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణి మాటాడుతూ, మంగళగిరి వస్తే సొంతింటికి వచ్చినట్టు ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్క రూ ఆలోచించి ఓటేయాలని, అభివృద్ధికి పట్టం కట్టాలని అన్నారు.రోడ్ షో అనంతరం స్థానికులతో బ్రాహ్మణి మాట్లాడారు. ఉపాధి ఎలా ఉంది అంటూ పలువురు చిరు వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. మంగళగిరి వాసుల కోసం లోకేష్ గారు 29 పథకాలు అందిస్తున్నారని అందరూ వాటిని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం చిన్న బండి దగ్గర టిఫెన్ చేశారు.

నాటకం పాత్రధారులతో వైఎస్ కృష్ణేశ్వరరావు తదితరులు

ఆకట్టుకున్న శ్రీకృష్ణార్జునయుద్ధం నాటక ప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బందావన్ గార్డెన్స్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై ఈశ్వర వరప్రసాద పరిషత్తు సహకారంతో, శ్రీలక్ష్మీనరసింహ నాట్యమండలి ధర్మపురి ఆధ్వర్యంలో శ్రీ కష్ణార్జున యుద్ధం పౌరాణిక పద్య నాటక ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నది.చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులు రాయగా, డాక్టర్ సంగనభట్ల నరసయ్య దర్శకత్వం వహించారు. శ్రీకష్ణుడిగా డాక్టర్ నరసయ్య, అర్జు నుడిగా నరహరిశర్మ, గయుడు, సాచ్చుకిగా బొజ్జ రాజగోపాల్శర్మ, నారదుడిగా సంగనభట్ల రామకష్ణయ్య వారి పాత్రలకు న్యాయం చేశారు.పుడమి గ్రూపు ముత్తవరపు సురేష్, ప్రముఖ రంగస్థల, సినీ నటులు దర్శకుడు వైఎస్ కృష్ణేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని పాత్రధారులను, సాంకేతిక నిపుణులను సత్కరించారు.

బిజెపి పాలనలో యాబై ఏళ్ళు వెన్నక్కి వెళ్లిన దేశం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చుక్కా చంద్రపాల్, సిపిఎం నాయకులు

బీజేపీ పాలనలో దేశం 50ఏళ్ళు వెన్నక్కి వెళ్లిందని ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చుక్కా చంద్రపాల్ అన్నారు. సత్తెనపల్లిలోని కొత్తపేట మున్సిపల్ కార్యా లయం ఏరియా నాగన్న కుంట ప్రాంతాల్లో చుక్కా చంద్రపాల్ సిపిఎం నాయకులతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. ఈ సంద ర్భంగా చుక్కా చంద్రపాల్ మాట్లా డుతూ ఈ దేశ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ మతత్వపార్టీ బిజెపిని ఓడించాలని, అలాగే ఆ పార్టీతో తో పొత్తు పెట్టుకున్న కూటమి అభ్యర్థులను, వైసిపిని ఓడించాలని పిలుపు నిచ్చారు. సత్తెనపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి జ్ఞాన్ రాజ్ పాల్ మాట్లాడుతూ దళితులు ముస్లిం మైనా రిటీలపై దాడు లకు పాల్పడుతున్న, బిజెపిని సాగనంపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పెండ్యాల మహేష్, అనుముల వీరబ్రహ్మం కాంగ్రెస్ పార్టీ ముప్పాళ్ళ మండల కార్యదర్శి కోట ఆనంద్ సిద్దిల మోహన్ రావు రాజు పాలెం మండల అధ్యక్షులు ఆరిఫ్, కాంగ్రెస్ నాయ కులు జెట్టి శేఖర్, ఐజయ్య మస్తాన్ వలీ, సుభాని పాల్గొన్నారు.

12డి ఫారం ఓట్ల సేకరణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల అధికారుల పర్యవేక్షణలోనూ నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయి. వృద్ధుల నుంచి ఓట్ల సేకరణ సజావుగా సాగ ట్లేదని, బాక్సులకు సీల్ లేకుండా అధికారులు ఓట్లు సేకరిస్తున్నారని గుంటూరు పార్లమెంట్ టిడిపి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు అభ్యర్థి బూర్ల రామాంజనేయులు కలెక్టర్ వేణుగోపాలరెడ్డికి శనివారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లా డుతూ లేమల్లెపాడులో స్థానిక వద్దుల నుంచి 12డి ఫారం ఓట్లను సేకరించారని, అయితే ఆ ఓట్ల బాక్సులకు ప్రభుత్వ సీల్ లేకుండా కేవలం చిన్న చిన్న తాళాలతో ఉండటం పలు వురు స్థాని కులు గమనించారని, ఇదే విషయాన్ని స్థానికులు అడిగితే అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేశారన్నారు. అలాగే నమూనా బ్యాలెట్ పత్రాలు తీసుకెళుతున్న వాహనాలను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్ళటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తూర్పు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ వివ రాలు ఆర్ఒ అందించలేదన్నారు. లేమల్లె పాడులో ఘటనపై తనకు రిపోర్ట్ ఇవ్వాలని సం బంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

రూ.5 లక్షలకు పైగా విలువ చేసే మత్తుపదార్థాలు స్వాధీనం

ప్రజాశక్తి-మంగళగిరి

తాడేపల్లి బైపాస్ రోడ్ లో 5 లక్షల 50 వేల రూపాయలు విలువైన 88 గ్రాముల మెత్ అనే మత్తు పదార్థాలను ఎస్సిబి అధికారులు పక్కా సమాచారంతో ఎస్ ఈ బి అధికారులు దాడి చేసి శనివారం పట్టు కున్నట్లుగా ఎస్ఇబి అడిషనల్ జిల్లా కమిషనర్ ఎం.వెంక టేశ్వరరావు మంగళగిరి ఎస్ఇబి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బెంగళూరులో కొనుగోలు చేసిన మత్తు పదార్థాలను గుంటూరు, విజయవాడ మధ్య గల బైపాస్ రోడ్‌లో విక్రయిస్తున్న ముగురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ ఈ బి సి ఐ లక్ష్మీ ప్రసన్న, ఎస్సై రాజేంద్ర, సిబ్బంది పద్మజ, శ్రీను, నాగరాజు, నరసింహారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఇబి అధికారులు

కూటమి విజయానికి కృషి చేయాలి : చిల్లపల్లి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణ జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం స్థానిక గౌడ కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని తాడేపల్లిలో జనసేన, టిడిపి కేడర్ పెరిగిందన్నారు. కూటమి విజయం కోసం కృషి చేయాలని చెప్పారు.

ఈవిఎంల కమిషనింగ్ పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ఈవిఎంల కమిషనింగ్‌కి ప్రక్రియ అత్యంత పకడ్బందీగా చేప ట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గుం టూరు తూర్పు నియోజక వర్గ పరిధిలోని ఈవిఎంల కమిషనింగ్ సెం టర్ ఏసి కాలేజిని, అలాగే లాడ్జి సెం టర్‌లోని ఆంధ్రా లూథరన్ కాలే జిలో జరుగుతున్న కమిష నింగ్ ప్రక్రియను కలెక్టర్ పరి శీలించారు. ఒక్కో ఈవిఎం కమిషనింగ్‌కు ఎంత సమయం పడుతుంది? ఎంత మంది సిబ్బంది కేటాయించారు? తదితర వివ రాలను రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరిని అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లా డుతూ సార్వత్రిక ఎన్ని కల్లో ఈవిఎంల కమిషనింగ్ కీలకమని అన్నారు. కమిషనింగ్ చేసిన వాటిని మాక్ పోల్ చేయా లన్నారు. కమిషనింగ్‌లో సమస్య ఎదురైనా వెంటనే టెక్ని కల్ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్ల దష్టికి తీసుకురావాలని తెలి పారు. ఎన్నికల ముందు రోజు తూర్పు నియోజకవర్గ పోలింగ్ అధికారులకు ఏసి కాలేజిలోనే ఈవిఎంలు, ఇతర పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ జరుగు తుందని, డిస్ట్రిబ్యూషన్ కు సెక్టార్ అధికారుల వారిగా భాధ్య తలు కేటాయించాలని రిటర్నింగ్ అధికారికి సూచించారు. కార్యక్రమంలో పశ్చిమ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి, అసి స్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగ న్నాద్, ఐటి నోడల్ అధికారి రఘు ఉన్నారు.

CHANGE OF NAME

I, **SHAIK PARVEEN** , W/o.PATTAN KHADAR VALI KHAN (old name), resident of D.NO: 21-7, Ali Nagar, Near Masjid, Duggirala (Village & mandal), Guntur - 522330, A.P. I have changed my husband name as **PATHAN KHADAR VALI KHAN** (New name),hereafter my husband name is known as **PATHAN KHADAR VALI KHAN** (New name).

దస్తావేజులు పోయినవి

నేను, జలసూత్రం యశోద, భర్త సాంబశివరావు, చినకాకాని, గుంటూరు జిల్లా నాకుగల చినకాకాని గ్రామం, మంగళగిరి మండలంలోని డి.నెం.218లో గల య.0.78 సెంట్లు ఆస్థి తాలూకు ఒరిజినల్ విక్రయ ద.నెం.367/1967, 2241/1966, 917/1966, 906/1966, యస్. ఆర్.ఒ. మంగళగిరి, నేను ది.03-05-2024న ఉదయం గం.10.00కు మంగళగిరి మండల రెవిన్యూ ఆఫీసుకు వెళ్ళు నిమిత్తం చినకాకాని ఆటోస్టాండుకు దగ్గరలోగల జిరాక్స్ షాపు వద్దకు వెళ్ళి చూసుకొనగా పై ఒరిజినల్ దస్తావేజులు పోయినది. ఎవరికైనా దొరికినచో నాకుగాని, మంగళగిరి రూరల్ పోలీసువారికిగాని అందజేయ వలెను. తగు పారితోషికము ఇవ్వబడును.

మంగళగిరి,
ది.04-05-2024

ఇట్లు
జలసూత్రం యశోద,
భర్త సాంబశివరావు,
చినకాకాని, గుంటూరు జిల్లా,
సెల్ నెం:9393064363

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పట్టణం, మెయిన్ రోడ్డు, డోర్. నెం. 9 - 1 - 49, కాపురస్తులు దొంతు ఆది నాగేశ్వరరావు గారి కుమారుడు దొంతు ఉమామహేశ్వరరావు గారి వలన సమాచారం పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

నాక్లయింటుకు పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మునిసిపాలిటి, రంగాకాలని డో.నెం.1-4-164/49కు సమీపమున ప్లాట్ నెం. 13 చ.గ. 173లు స్థలమును గుంటూరు కాపురస్తులైన నార్నె సాంబశివరావు గారి వద్ద నుండి ది. 14. 11. 2011వ తేదిన విక్రయ దస్తావేజు నెం. 9766/2011 ద్వారా రిజిష్టరు పొందియున్నారు. ది. 01.05.2024వ తేదిన నా క్లయింటు సదరు విక్రయ దస్తావేజును జిరాక్సు తీయించుకొను నిమిత్తం ఇంటి నుండి యన్.జి.ఓ హోమ్ సెంటర్‌కు వచ్చుచుండగా మార్గమధ్యములో జారిపడిపోయినది. సదరు డాక్యుమెంట్లు కొరకు వెతికిననూ కనబడి యుండలేదు. కావున నా క్లయింటుకు చెందిన విక్రయ దస్తావేజు నెం. 9766/2011 డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికినచో నాకుగాని, నాక్లయింటు అయిన దొంతు ఉమాహహేశ్వరరావుకు గాని అందజేయవలసినదిగా కోరుచున్నాను.

సత్తెనపల్లి
తేది: 4.05.2024

యేమినేని కిరణ్‌కుమార్
న్యాయవాది, సత్తెనపల్లి.
సెల్ : **9154172173**

నోటీసు
మహారాజ శ్రీ సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) సత్తెనపల్లి వారి కోర్టులో
HMOP No. 109/2023

బిట్వీన్:
దుడుకు రమేష్ S/o మల్లిఖార్జునరావు, రాజుపాలెం .... పిటీషనర్

అండ్

దుడుకు శ్రావణి @ పిడతల శ్రావణి ... రెస్పాండెంట్ D/o పిడతల రాంబాబు, R/o LR Colony Zero Lane, 2nd House Guntur Town, Guntur District.

పై నెంబరు పిటీషన్ నందు పిటీషనరు దుడుకు రమేష్ మీపై వివాహము రద్దు కొరకు, హిందూ మ్యారేజి చట్టం క్రింద పిటీషను దాఖలు చేసుకున్నారు. మీరు సాధారణ అడ్రసులో వుండనందున మరియు మీపై మిస్సింగ్ కేసు ఉన్నందున మీరు ఈ పిటీషన్, నోటీసు తీసుకొనుటకు గాను మరియు మీ వాదన తెలుపుటకు స్వయంగా గానీ, మీ తరపు వకీలు ద్వారా గానీ ది. 06-05-2024 ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

వాయిదాతేది : 06-05-2024

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

పి.సిహెచ్.వెంకట కోటయ్య,
పిటీషనర్ తరపు న్యాయవాది,
సత్తెనపల్లి.

FORMAT C-1

Name and address of candidate: **BollaBrahmanaidu, S/o Hanumaiah,** aged 68 years, resident of Door No. 3-29-1, Velpuru village, Savalyapuram Mandal, Palnadu district, A-P.,

Name of political party: **YuvajanaSramikaRythu Congress Party**
Name of Election : **General Assembly Election for A.P.State**
Name of Constituency: **99- Vinukonda Assembly Constituency**

I, **BollaBrahmanaidu,** a candidate for theabovementioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending criminal cases

Sl. No.	Name of Court	Case No. and dated	Status of case(s)	Section(s) of Acts concerned and brief description of offence(s)
1.	Addl. Judicial 1st class Magistrate Court: Tuni	C.C.No: 382/2015	Charge Sheet filed and it is under trial	U/S 6 and Rule 4 (1) and 6, Sec 6 Rule 3(1) (a), Sec 112, Rule 103, R/W Sec 2(1) and sec 92 of Factories Act 1948 This case is filed against the accused carrying on the manufacturing processes in the factory without obtaining valid license from the inspector of factories kakinada1 and the premises is taken into use by carrying on the manufacturing processes without obtaining plans, permission in writing approving the plans
2.	Principal Junior Civil Judge Court Gudiwada	C.C.No: 511/2014	Charge Sheet filed and it is under trial	U/s 21 (i) (iv)(b) 31 and 56, 41 and rule 61E, and sec 83 and rule 87 and sec 92of Factories Act 1948. This case is filed against the accused failed weld mesh guard to the v belt drive of IBT, separator and failed to get the examination of NH3 receiver tested by a competent person and produce certificate and failed to provide NH3 canister mask and self-contained breathing apparatus to the NH3 compressor operator and failed to maintain leave with wages to all the workers
3.	Judicial First Class Magistrate Vinukonda	Cr. No. 65/2024	Crime Stage	U/S 188 and 504 of I.P.C. This case is filed against the accused basing on the News clipping in Eenadu daily newspaper - content against Modal Code of Conduct

(B) Details about cases of conviction for criminal offences

Sl. No.	Name of Court& date(s) of order(s)	Description of offence(s) & Punishment imposed		Maximum Punishment Imposed
1	Judicial 1st Class Magistrate, Prathipadu	In STC 5/2015	Sec.6, R.4(1) and (6), R.3(1)(a), Sec.112 and R.103, R/w Sec.2(1) punishable U/s. 92 of Factories Act.	Sentenced to pay fine of Rs. 5,000/- on 18.12.2020 and it is paid

క్రిమినల్ కేసుల డిక్లరేషన్

(రిట్ పిటిషన్ (సివిల్) నెం. No.536 of 2011 (Public Interest Foundation & Others & Union Govt. of India & Anr) లో సెప్టెంబర్ 25, 2018 న ఆదరణీయ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి) అభ్యర్థి పేరు, చిరునామా : **పోలుబోయిన అనీల్ కుమార్**
తండ్రి లేట్. పోలుబోయిన తిరుపాలయ్య,
26-1-1591, బి-బ్లాక్, ఇస్కాన్ సిటీ,
ఇస్కాన్ మందిరం, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్.

రాజకీయ పార్టీ పేరు : **యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ**
ఎన్నిక పేరు : **లోక్‌సభ - 2024**
పార్లమెంటరీ నియోజకవర్గం పేరు : **నరసరావుపేట**

పై తెలిపిన ఎన్నికలో ఒక అభ్యర్థిగా నేను పోలుబోయిన అనీల్ కుమార్, నా నేర చరిత్రకు సంబంధించి ప్రజలకు సమాచారం అందజేసే నిమిత్తం ఈ క్రింది వివరాలు ప్రకటిస్తున్నాను.

	విచారణలో ఉన్న క్రిమినల్ కేసులు			క్రిమినల్ నేరాల్లో శిక్షపడిన నేరాల వివరాలు	
క్రమ సంఖ్య	కోర్టుపేరు	కేసు నంబరు, ప్రస్తుత స్థితి	సంబంధిత చట్టాలు, సెక్షన్‌లు నేరం వివరాలు క్లుప్తంగా	కోర్టు పేరు, తీర్పు ప్రకటించిన తేది	నేరాల వివరాలు, విధించిన శిక్ష
1.	In the court of Hon'ble Special Judge Court for trail of cases relating to elected MPs and MLAs, Vijayawada	CC No. 69/2018, Case Pending	U/s.143, 341, 188 r/w149 IPC (Protesting for special status to Andhra Pradesh)	Not Applicable	Not Applicable

ఇట్లు
పోలుబోయిన అనీల్ కుమార్
నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి
యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ

ప్రజాశక్తి
www.prajasakti.com
గుంటూరు జిల్లా
పల్నాడు జిల్లా

ఓటర్ల లిస్ట్‌లో ఫుల్... అభ్యర్థుల లిస్ట్‌లో నిల్

మహిళలకు అవకాశం ఇవ్వని రాజకీయపార్టీలు - 1999లో ఒక్కసారే జూలకంటి దుర్గాంబకు అవకాశం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

రాజకీయ చైతన్యం మెండుగా ఉన్న ప్రాంతం పల్నాడు. పల్నాడు అంటే నేటి పల్నాడు జిల్లా పరిధి కాదు. చారిత్రకంగా మాచర్ల, గురజాల శాసనసభ నియోజవకర్గాల పరిధిలోని ప్రాంతం. వెయ్యి సంవత్సరాల క్రితమే కుల, వర్ణ వ్యవస్థను నిరసిస్తూ చాపకూడు పెట్టి సమసమాజ స్థాపనకు బీజం వేసిన ప్రాంతం. ప్రపంచంలోనే ప్రతిభ ఆధారంగా ఒక మహిళకు అధికారం అప్పగించి మంత్రిని చేసిన ప్రాంతం. అడవి పుల్లరి శాసనాన్ని దిక్కరించి, బ్రిటీష్ తుపాకి గుళ్ళకు ఎదురు నిలిచి ప్రాణత్యాగాలు చేసిన ప్రాంతం, తెలంగాణా రైతాంగ సాయిధ పోరాటానికి ఎందర్నో అంకితం చేసిన ప్రాంతం. నందికొండ ప్రాజెక్టు (నాగార్జునసాగర్) కోసం ఉద్యమాలు నడిపి సాధించిన గడ్డ. ఎన్నికల భారతంలో కమ్యునిస్టులను, స్వతంత్ర అభ్యర్థును ఎన్నుకొని చట్టసభలకు పంపిన నేల పల్నాడు. ఇంతటి రాజకీయ చైతన్యం కలిగిన పల్నాడులో మహిళలకు సరైన గుర్తింపు, ప్రాతినిధ్యం లభించటం లేదని చెప్పవచ్చు. వెయ్యి సంవత్సరాల క్రితమే పురషాధిక్య రాచరిక వ్యవస్థలో పల్నాడు రాజ్యానికి మంత్రిగా చేసి , ప్రతిభను చాటిన నాగమ్మ నాయకురాలు అనే బిరుదు పొందింది. అలాంటి పల్నాడు గడ్డపై ప్రజాస్వామ్య వ్యవస్థలో మాచర్ల శాసనసభ నియోజకవర్గం నుండి ప్రజాప్రతినిధిగా ఎన్నికైన జూలకంటి దుర్గాంబ పల్నాడుకు ఒకే మహిళా నాయకురాలని పేరు తెచ్చుకున్నారు. ఎంతో రాజకీయ చైతన్యం కలగిన పల్నాడు ప్రాంతంలోని మాచర్ల, గురజాల నియోజవర్గాలల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వటంలో ప్రధాన రాజకీయపార్టీలు విఫలం అయ్యాయి. ఈ రెండు నియోజవర్గాల్లో 1952 నుంచి జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే ఏ ఒక్క రాజకీయ పార్టీకూడా మహిళలకు పోటీ చేసే అవకాశం కల్పించలేదు.1999 లో జరిగిన ఎన్నికలలో మాత్రం మాచర్ల శాసనసభ నియోజవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ మహిళా అభ్యర్థిని పోటీకి నిలిపింది. ఆ ఎన్నికలల్లో తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసిన జూలకంటి దుర్గాంబ, కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీచేసిన పిన్నెల్లి లక్ష్మారెడ్డి పై 1,951 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం ఓట్లలో ఆమెకు 54,128 ఓట్లు రాగా, లక్ష్మారెడ్డికి 52,177 ఓట్లు వచ్చాయి. అలా పోటీ చేసి, శాసనసభ్యురాలుగా ఎన్నికైన ఒకేఒక్క మహిళగా పల్నాడులో దుర్గాంబ నిలిచిపోయారు.

ఈ ఒక్క ఎన్నిక మినిహా మాచర్లగాని, గురజాలలోగాని మరి ఏ మహిళకు రాజకీయ పార్టీల తరుపున చట్టసభలకు ఎన్నికల్లో పోటీ అవకాశం దక్కలేదు. అందునా మాచర్ల, గురజాలలో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువ. కానీ రాజకీయపార్టీలు మాత్రం పురుష అభ్యర్థులకే ప్రాధాన్యతనిస్తూ, మహిళలను విస్మరించటం పట్ల స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలను అన్ని విధాల, అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోని తీసుకువస్తున్నామని రాజకీయపార్టీల నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తుంటారు. కానీ ఆచరణలో మాత్రం మహిళలకు మొండిచేయి చూపుతారంటున్నారు.

ఈ రెండు నియోజవర్గాల్లో 1952 నుంచి 2019 వరకు 14 సార్లు శాసనసభ ఎన్నికలు జరగ్గా, రాజకీయ పార్టీలు ఒక సారి మాత్రమే పోటీ అవకాశం ఇచ్చిందని, ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో కూడా మహిళా అభ్యర్థికి అవకాశం ఇవ్వకపోవటం చూస్తే రాజకీయలపార్టీలు ఇక్కడ మహిళకు ఇచ్చే ప్రాధాన్యత ఎంటో ఇట్టే అర్థం చేసుకోవచ్చని స్థానిక మహిళలు అంటున్నారు.

తప్పుడు హామీలతో ప్రజల ముందుకు కూటమి నేతలు

మోసపూరిత హామీలు నమ్మొద్దు : వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తప్పుడు హామీలతో ప్రజల ముందుకు వస్తున్న కూటమి నేతల మోసపూరిత హామీలను ప్రజలు నమ్మి మోసపోవద్దని మేనిఫెస్టోను ఎన్నికలయ్యేంత వరకు అందరికీ చూపిస్తారని ఆ తరువాత దాన్ని మాయం చేసే వ్యక్తి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అని నరసరావు పేట వైసిపి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణంలోని 26 వ వార్డులో, నరసరావుపేట మండలంలోని ములకలూరు గ్రామంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని చేరువ చేసి పేదలకు మంచి చేసిన ప్రభుత్వానికి ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. 5 ఏళ్లలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని చూసి ఈ నెల 13 న జరగనున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైసిపి పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ 5 లక్షల నుంచి రూ 25 లక్షల వరకు పెంచారని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి చూపించారన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రి రూపురేఖలు మార్చివేశారన్నారు. మహిళలు, పేదల ఆర్థికాభివృద్ధి కోసం ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలన్నా రాష్ట్రాభివృద్ధి జరగాలన్నా మరోసారి వైసిపిని గెలిపించాల న్నారు. రాష్ట్రాన్ని విచ్చిన్నం చేయడానికి కూటమి పేరుతో విపక్షాలు ముందుకు వస్తాయని అలాంటి వారిని నమ్మవద్దని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వైసిపిలో చేరిన 25 కుటుంబాలకు డాక్టర్ గోపిరెడ్డి వైసిపి కండువాలు కప్పి ఆహ్వానించారు.

26 వార్డులో ఎన్నికల ప్రచారంలో వృద్ధురాలిని పలకరిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

గుంటూరు దాహార్తి తీరుస్తాం

గోరంట్ల రిజర్వాయర్‌ను పరిశీలించిన పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామని పార్లమెంట్ టిడిపి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. గుంటూరు నగరంలో భాగమైన గోరంట్లలో కొన్నేళ్లుగా ఆగిపోయిన రిజర్వాయర్ నిర్మాణ పనులను టిడిపి అసెంబ్లీ అభ్యర్థులతో కలిసి ఆయన శనివారం సాయంత్రం పరిశీలించారు. తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల అసెంబ్లీ అభ్యర్థులైన నసీర్ అహ్మద్, పిడుగురాళ్ల మాధవి, బూర్ల రామాంజనేయులుతో కలిసి పెమ్మసాని వెంట ఉన్నారు. సుమారు 13 లక్షల జనాభా ఉన్న గుంటూరు నగరంలో నేటికీ నీటి ఎద్దడి సమస్య పరిష్కారం కాలేదన్నారు. దాదాపు 3 లక్షల మంది ప్రజలు నీళ్ల అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. టిడిపి హయాంలో రాబోయే 20-30 ఏళ్లలో పెరగబోయే జనాభాకు ఉపయోగపడేలా పలు వాటర్ పథకాలను నిర్మించాల్సి ఉందన్నారు. గుంటూరులో విలీన గ్రామాలతో పాటు నగర శివారు ప్రాంతాల్లోని సుమారు 3-4 లక్షల మంది ప్రజలకు నీరు అందించాలని రూపొందించిన ప్రణాళిక అమలుకు వైసిపి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపట్టలేదన్నారు. ఇందులో భాగంగా గోరంట్ల రిజర్వాయర్ నిర్మాణం పూర్తయి ఉంటే గ్రావిటీ ద్వారా గుంటూరు ప్రజలకు తాగునీరు అందించడానికి అవకాశం ఉండేదన్నారు. బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ విలీనగ్రామాల ప్రజలు ఇబ్బందులు పరిష్కారించాల్సిన బాధ్యత కార్పొరేషన్‌పై ఉందన్నారు. గల్లా మాధవి మాట్లాడుతూ ప్రజలకు నీళ్ల అందించే ప్రాజెక్టును ఆపడం ప్రభుత్వాల పని కాదన్నారు. పనులు ఆపి, వెనక్కు వెళ్లిన కాంట్రాక్టర్లను సంప్రదించి ఆగిపోయిన పనులను పునరుద్ధరిస్తామన్నారు. నశీర్ అహ్మద్ మాట్లాడుతూ గత మూడేళ్ల కార్పొరేషన్ నిర్లక్ష్యం వల్ల ప్రజలకు తాగునీరు లభ్యం కావడం లేదన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర వర్మ, టిడిపి నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, కార్పొరేటర్ నూకవరపు బాలాజీ, గోరంట్ల మాజీ సర్పంచ్ కందుల సుబ్బారావు పాల్గొన్నారు. అంతకు ముందు తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పెమ్మసాని,నశీర్ అహ్మద్‌లు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు.

తూర్పు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పెమ్మసాని, నశీర్

గుంటూరు తూర్పులో రసవత్తరం

- పోటా పోటీగా వైసిపి, టిడిపి అభ్యర్థుల ప్రచారం
- కాంగ్రెస్ అభ్యర్థికి పెరుగుతున్న ఆదరణ

మైనార్టీల నియోజకవర్గంగా గుంటూరు తూర్పు అసెంబ్లీ ప్రసిద్ధి చెందింది. నియోజకవర్గంలో సంఖ్యాపరంగా ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉండటంతో అన్ని పార్టీలూ మైనార్టీ అభ్యర్థులకే టిక్కెట్లు ఇస్తున్నారు. నియోజకవర్గ ఎన్నికల్లో అత్యధిక సార్లు మైనార్టీలే గెలుపొందారు. ప్రధానంగా ఈ సారి ఎన్నికల్లో తొలిసారిగా వైసిపి నుండి మహిళా అభ్యర్థిగా, ఎమ్మెల్యే ముస్తఫా కూతురు నూరి ఫాతిమా, టిడిపి తరపున ఎండి.నసీర్ అహ్మద్, కాంగ్రెస్ నుండి మస్తాన్‌వలి పోటీ పడుతున్నారు.



ప్రజాశక్తి-గుంటూరు

చిరు వ్యాపారాలు, ఆటోమైబైల్, హోల్‌సేల్, రిటైల్ మార్కెట్, పెద్ద సంఖ్యలో ఆసుపత్రులు, ఆర్టీసి బస్టాండ్, చారిత్రాత్మక మసీదులు, దేవాలయాలు, చర్చిలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. 1983 నుండి మైనార్టీ అభ్యర్థులే ఇక్కడ గెలుపొందుతున్నారు. 2014లో మైనార్టీయేతర అభ్యర్థిని టిడిపి నిలబెట్టినా ఫలితం లేదు. దీంతో మైనార్టీలకు పెట్టనికోటగా తూర్పు నియోజకర్గం ప్రసిద్ధి చెందింది. ఈ నియోజకవర్గానికి 1952 నుండి 15 సార్లు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 8సార్లు, టిడిపి మూడుసార్లు, వైసిపి రెండుసార్లు గెలిచింది. కమ్యూనిస్టులను కూడా ఈ నియోజకవర్గం ఆదరించింది. 1962లో సిపిఐ అభ్యర్థి కనపర్తి నాగయ్య కాంగ్రెస్ అభ్యర్థి ఎ.ఎస్.రావుపై గెలుపొందారు. 1972 వరకూ సిపిఐ ప్రధాన పోటీదారుగా ఈ నియోజవర్గంలో ఉంది. 1952లో నియోజకవర్గం ఏర్పడిన తర్వాత మొదటిసారి ఎన్ వి ఎల్. నరసింహారావు గెలుపొందారు. ఆతర్వాత టి.జాలయ్య, కనపర్తి నాగయ్య, శనక్కాయల అంకమ్మ, వి.రామానుజం గెలుపొందారు. అయితే వారు ఎవరూ రెండోసారి గెలుపొందలేదు. 1983లో ఎన్‌టి రామారావు ప్రభంజనంలో టిడిపి అభ్యర్థి పటాన్‌ఖాన్ 41వేలకుపైగా మెజారిటీతో గెలుపొందారు. ఆ తర్వాత 1985, 89 ఎన్నికల్లో కాంగ్రెస్ నుండి మహ్మద్ జానీ గెలుపొంది మంత్రిగా పనిచేశారు. మహమ్మద్ జాని, ఎస్ఎం జియావుద్దిన్, ముస్తఫా మాత్రమే రెండుసార్లు ఎన్నికయ్యారు. గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి నసీర్‌పై గెలుపొంది రెండోసారి ముస్తఫా విజయం సాధించారు.

సం	విజేత	ప్రత్యర్థి	మెజార్టీ
1952	ఎస్‌విఎల్.నరసింహారావు-కెఎంపిపి	వై.తిరుపతయ్య-సిపిఐ	2,747
1955	టి.జాలయ్య-కాంగ్రెస్	డి.వి.అప్పారావు-సిపిఐ	1,400
1962	కనపర్తి నాగయ్య-సిపిఐ	ఎ.ఎస్.రావు-కాంగ్రెస్	6,953
1967	శనక్కాయల అంకమ్మ-కాంగ్రెస్	కె.మల్లయ్యలింగం-సిపిఐ	6,592
1972	వి.రామానుజం-కాంగ్రెస్	కె.మల్లయ్యలింగం-సిపిఐ	4,302
1978	లింగంశెట్టి ఈశ్వరరావు-కాంగ్రెస్(ఐ)	మహ్మద్ ఎ.ఖాన్-జనతా	15,560
1983	యు.కె.పఠాన్-టిడిపి	లింగంశెట్టి ఈశ్వరరావు-కాంగ్రెస్	41,364
1985	మహమ్మద్ జాని-కాంగ్రెస్	షేక్.సయ్యద్ సాహెబ్-టిడిపి	2,431
1989	మహమ్మద్ జాని-కాంగ్రెస్	షేక్.సయ్యద్ సాహెబ్-టిడిపి	19,221
1994	ఎస్.ఎం.జియావుద్దీన్-టిడిపి	మహమ్మద్ జాని-కాంగ్రెస్	26,795
1999	ఎస్ఎం.జియావుద్దీన్-టిడిపి	మహమ్మద్ జాని-కాగ్రెస్	6,097
2004	షేక్.సుబాని-కాంగ్రెస్	ఎస్ఎం.జియావుద్దీన్-టిడిపి	35,964
2009	షేక్.మస్తాన్‌వలి-కాంగ్రెస్	షేక్.షౌకత్-ప్రజారాజ్యం	9,012
2014	మహమ్మద్ ముస్తఫా-వైసిపి	మద్దాళి గిరిధర్-టిడిపి	3,151
2019	మహమ్మద్ ముస్తఫా-వైసిపి	ఎండి.నసీర్ అహ్మద్	22,091

అయితే ప్రస్తుతం ఎన్నికల్లో ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమాను వైసిపి పోటికి దింపింది. దీంతో నియోజకవర్గ చరిత్రలో ప్రధాన పార్టీ నుండి తొలిసారిగా మహిళా అభ్యర్థి పోటీలో ఉన్నట్లు అయ్యింది. ముస్తఫాకు వివాద రహితుడిగా నియోజకవర్గంలో పేరు ఉంది. ఈ సారికూడా వైసిపి ఇక్కడ గెలుస్తుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే రెండుసార్లు ఎన్నికవటంతో సహజమైన వ్యతిరేకత, గత ఎన్నికల్లో ఓడిపోవటం వల్ల సానుభూతి తనకు ఉపయోగపడుతుందని టిడిపి అభ్యర్థి నసీర్ భావిస్తున్నారు. అయితే ఈసారి టిడిపి బిజెపి భాగస్వామ్యంతో కూటమి కట్టడంతో మైనార్టీ ఓట్లు దూరమయ్యే ప్రమాదం ఉందని, ఇది వైసిపికి కొంత లాభం చేకూరుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గత రెండు దఫాలుగా జరిగిన ఎన్నిల్లో ప్రాభవం కల్పోయిన కాంగ్రెస్ ఈసారి మెరుగైన ఓట్లు సాధించే అవకాశం కనిపిస్తుంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు, టిడిపి బిజెపితో జట్టు కట్టడంతో వారి పట్ల ఉన్న వ్యతిరేకతతో మైనార్టీలు కాంగ్రెస్ అభ్యర్థికి ఓట్లు వేసే అవకాశం కనిపిస్తుంది. రోజురోజుకూ ఇండియా వేదిక తరపున పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి మస్తాన్‌వలికి ఆదరణ పెరుగుతుంది. దీంతో త్రిముఖ పోరుగా మారే అవకాశం కూడా లేకపోలేదు. ఈ నేపథ్యంలో ఈ సారి ఎన్నికలు మరింత రసవత్తరంగా మారాయి.

నూరి ఫాతిమా (వైఎస్‌ఆర్‌సిపి)

నసీర్ అహ్మద్ (తెలుగుదేశం పార్టీ)

మస్తాన్‌వలి, (కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి)

టిడిపి వస్తే సంక్షేమ పథకాలు ఉండవు

వైసిపి వస్తేనే నవరత్నాల కొనసాగింపు

ఎన్నికల ప్రచారంలో రజిని, అప్పిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి అధికారంలోకి వస్తే ప్రస్తుతం అమలు అవుతున్న సంక్షేమ పథకాలన్ని ఆగిపోతాయని వైసిపి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. స్థానిక 25వ డివిజన్‌లో శనివారం ఎన్నికల ప్రచారాన్ని ఆమె నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేపట్టారు. సంక్షేమ పథకాలన్నీ ఇలాగే కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని చెప్పారు. చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలను నిలిపేసే కుట్రలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పింఛన్లు వద్దులకు దక్కుండా చేశారని, ఇప్పుడు సంక్షేమ ఫలాలు కూడా దక్కుకుండా అడ్డుకునే కుతంత్రాలకు తెరతీశారని దుయ్యబట్టారు. చంద్రబాబునాయుడు అలవిగాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు విషపు కౌగిలి గురించి అందరికీ తెలుసనని చెప్పారు. ఆ వలలో చిక్కుకుంటే కొండ చిలువ నోట్లో తల పెట్టినట్టేనని తెలిపారు. చంద్రబాబునాయుడు గత చరిత్ర తెలిసినవారెవరూ ఆయనకు ఓట్లేయరి తెలిపారు. జగనన్న సభలకు మండుటెండల్లో మిట్టమధ్యాహ్నం కూడా జగనన్న సభలకు వస్తున్న జనాల్ని చూసి విపక్ష నేతలు బెంబేలెత్తుతున్నారని, ఓటమి భయం చంద్రబాబు, లోకేష్ మాటల్లో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన పెద్దమనిషి తనకంటూ చెప్పుకోవడానికి ఒక్క పథకం కూడా లేదని దుయ్యబట్టారు. చివరకు జగన్ చేసిన వన్నీ తానూ చేస్తానని, అంతకంటే ఎక్కువ చేస్తానని ఆయన చెబుతున్నాడంటే.. ఆయన మానసిక స్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. మొన్నటిదాకా వలంటీర్లను తిట్టిన వారే ఇప్పుడు ఆ వ్యవస్థను తామూ కొనసాగిస్తామంటున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈనెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో వైసిపి గెలుపు ఖాయం అని అన్నారు. తొలుత 25వ డివిజన్ పరిధిలోని జోసఫ్ నగర్, కొత్తకాలనీ ప్రాంతాల్లో మంత్రి రజిని పర్యటించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

25వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న విడదల రజని, అప్పిరెడ్డి,ఏసురత్నం

మంగళగిరిలో సిపిఎం విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి

పేదల సమస్యల కోసం నిరంతర పనిచేసే కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని సిపిఎం మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి జొన్న శివశంకరరావు అన్నారు. శనివారం మంగళగిరి పట్టణంలోని పార్క్ రోడ్, అంబేద్కర్ సెంటర్, దేవస్థానం రోడ్డు, రెండవ వార్డు, కంటే వారి వీధి, శివాలయం వెనుక వీధి, పానకాల స్వామి మెట్ల రోడ్డు, ఘాట్ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి, ఇందిరానగర్, ఇప్పటం రోడ్డు, ఆంజనేయ కాలనీ, వీవర్స్ కాలనీ, కప్పు రావు కాలనీలో రోడ్ షో కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండియా బ్లాక్ వేదిక తరపున పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు, గుంటూరు పార్లమెంటుకు పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ రోడ్ షో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జొన్న మాట్లాడుతూ పేద ప్రజల ఇళ్ల స్థలాల కోసం, ఇళ్ల పట్టాల కోసం పోరాటం చేసింది కమ్యూనిస్టు పార్టీలే అని అన్నారు. అందులో సిపిఎం అగ్రభాగాన ఉండి పోరాటం చేసిందని అన్నారు. కొండ పోరంబోకు ప్రాంతాల్లో ఇల్లు చేసుకున్న నివాసం ఉంటున్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు సమస్య పరిష్కారం కావాలంటే కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను ఈ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం పనిచేసింది కమ్యూనిస్టు పార్టీలు లేనని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను గెలిపించుకొని పార్లమెంటుకు, శాసనసభకు పంపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. మౌలిక సమస్యలు పరిష్కారం కావాలంటే కమ్యూనిస్టులను గెలిపించాలని కోరారు. ప్రజలపై భారాలు వేసే పార్టీలకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, పట్టణ నాయకులు ఎం చలపతిరావు, కే ఏడుకొండలు, ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, సిపిఎం నాయకులు గోలి దుర్గాప్రసాద్, ఈ విజయలక్ష్మి, , ఈ కాటమరాజు, బి స్వామినాథ్, తదితరులు పాల్గొన్నారు. రోడ్ షో కార్యక్రమంలో తీన్మార్, ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలను ఆలపించారు. సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు పూలమాలవేసి హారతి ఇచ్చి స్వాగతం పలికారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల : బిజెపి కూటమిని వైసీపీని ఓడించాలని ఇండియా బ్లాక్ బలపరిచిన అభ్యర్థి జొన్న శివశంకర్‌ను గెలిపించాలని సిపిఎం పార్టీ నాయకులు శనివారం మోరంపూడి గ్రామ పరిధిలోని మొక్కజొన్న పొలాలకు వెళ్లి కండెలు విరిచే వ్యవసాయ కూలీలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సిఐటియు కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మండల కార్యదర్శి జెట్టి బాలరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి : సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావును గెలిపించాలని కోరుతూ సిపిఎం ,సిపిఐ వడ్లపూడి గ్రామ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని పెదవడ్లపూడి కొత్తపాలెం, కాలువ కట్ల ఏరియాలో ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దండాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మంగళగిరి అభివృద్ధి కమ్యూనిస్టు పార్టీలతోనే సాధ్యమని, ప్రజలు ఆలోచించి ప్రజలకు అందుబాటులో ఉండే అభ్యర్థిని జొన్న శివశంకరరావు ను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ఇండియా బ్లాక్ పార్లమెంటు అభ్యర్థి అజయ్ కుమార్ కు కంకి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు కార్యక్రమంలో సిపియం కార్యదర్శి కోటిలింగం, సిపిఐ కార్యదర్శి నాగేశ్వరరావు, సైకం శివయ్య, నాయకులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :కార్మికుల పక్షాన పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కార్మిక చట్టాలను కాలరాస్తున్న బిజెపి, దానికి మద్దతు తెలుపుతున్న టిడిపి వైసిపిలకు ఓటు వేస్తే కార్మిక వర్గాన్ని బానిసలుగా మారుస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దండాల లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు కోటిలింగం, ౦ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తాడేపల్లి :**ఇండియా వేదిక బలపరిచిన మంగళగిరి నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరావు, గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌ల విజయాన్ని కాంక్షిస్తూ శనివారం తాడేపల్లి సుందయ్యనగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకే ఆరు దళాలుగా ఏర్పడి పెద్దఎత్తున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టె కరుణాకరరావు, గిరిజ, కె.ఉషారాణి, పి.రామచంద్రరావు, వి.రామారావు, ఎస్‌కె బాష, బూరుగ వెంకటేశ్వర్లు, కె.బాబూరావు, వై.బర్నబస్, వి.శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో ప్రచారం

8న తాడేపల్లిలో సీతారాం ఏచూరి సభ

ప్రజాశక్తి-తాడేపల్లి :ఇండియా వేదిక బలపరిచిన మంగళగిరి నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరావు, గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌ల విజయాన్ని కాంక్షిస్తూ ఈ నెల 8వ తేదీ బుధవారం సాయంత్రం ఐదు గంటలకు తడేపల్లి నెహ్రూ బొమ్మ సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. ఈ సభలో సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో పాటు సిపిఐ, కాంగ్రెస్ నాయకులు పాల్గొంటారని తెలిపారు. శనివారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో జరిగిన పార్టీ పట్టణ విస్తృతస్థాయి సమావేశంలో రామారావు మాట్లాడారు. సమావేశానికి గాదె సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ గడిసిన రెండు దశల పోలింగ్ సరళిలో బిజెపికి వ్యతిరేక పవనాలు వీస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నట్లు చెప్పారు. దీంతో మోడీ సహనం కోల్పోయి మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇండియా వేదిక అధికారంలోకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఈసారి వామపక్షాల బలం గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.మురళీకృష్ణ, ఎం.సూర్యారావు, వై.నేతాజీ, బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కొట్టె కరుణాకరరావు పాల్గొన్నారు.

సాగు, తాగు నీరందించడమే లక్ష్యం

వైసిపి అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గంలో ప్రజలకు తాగు, సాగునీరు అందిచడమే తన లక్ష్యమని వైసిపి అభ్యర్థి బలసాకి కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గంలో వట్టి చేరుకురు మండలం లోని కొర్నెపాడు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. ప్రతి నెల ఒకటో తేదీన ఇంటికే పింఛన్ వచ్చేదని, రెండు నెలలుగా కోర్టులకు వెళ్లి మరీ వలంటీర్ల ద్వారా పింఛన్ అందకుండా చేయాలని చంద్రబాబు కుట్ర చేశారని మండిపడ్డారు. అయితే అలాంటి వలంటీర్లకు అధికారంలోకి వచ్చాక రూ.10 వేలు ఇస్తానని చెప్పడం.. వలంటీర్ల వ్యవస్థను మెచ్చుకున్నట్టేనని పేర్కొన్నారు. ఇలా చంద్రబాబు రెండు నాలుకల ధోరణితో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని, మేనిఫెస్టోలో ఎన్ని బూటకపు హామీలిచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. కాకుమాను మండలంలో కొమ్మమూరు కాలువ ఆధునికీకరణకు కట్టుబడి ఉన్నామని, ఈ ప్రాంత రైతుల కష్టాలు తీరుస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్ల కాలంలో ప్రతి ఇంటికీ రైతు భరోసా ద్వారా జగనన్న పెట్టుబడి సాయం అందించారని, రైతన్నలు అప్పులు బారిన పడకుండా ఉన్నారని పేర్కొన్నారు. దీంతోపాటు వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా సాయం చేశారన్నారు. కల్తీ విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు అరికట్టగలిగామని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు.

సామాజిక పింఛనులో కోత!

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మూడ్రోజులపాటు ఎండల్లో నానా తిప్పలు పడితే ఈనెల పింఛను చేతిలో పడింది.. తీరా చూస్తే రూ.2 వేలే ఇచ్చారు. ఇదేమిటయ్యా.. అని అడిగితే ఖాతాలో కనీస నిల్వ ఉండాలి. అందుకే రూ.వెయ్యి కట్ చేసుకుని ఇచ్చాం.. అని పండరిపురంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచిలో సామాజిక పింఛను తీసుకున్న సుబానీ నగర్‌కు చెందిన 65 ఏళ్ల పైబడిన వృద్ధురాలు వాపోయారు. బ్యాంకు ఖాతాల్లో జమైన పింఛను తీసుకునే వారిలో ఎక్కువ మంది ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు.

పట్టణంలోని లబ్ధిదారుల్లో 8620 మందికి పింఛను మొత్తాన్ని బ్యాంకుల్లో జమ చేశారు. గురువారం నుండి ఈ డబ్బులు తీసుకోవడానికి లబ్ధిదార్లు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఇందుకుగాను తాము ఇప్పటికే ఆటో, రిక్షా ఖర్చులు రూ.వందకుపైగా చేశామని పలువురు చెబుతున్నారు. గ్రామీణులకైతే ఇదింకా రూ.200కు పైగా అయ్యాయి. దీనికితోడు లబ్ధిదార్లంతా దాదాపు నిరక్షరాస్యులు కావడంతో లేదా విత్‌డ్రా అప్లికేషన్ రాసుకోలేని వారు. బ్యాంకుల్లో ఇందుకు ప్రత్యేక సిబ్బంది లేకపోవడంతో బయటివారిపై లబ్ధిదార్లు ఆధారపడాల్సి వచ్చింది. దీంతో వారు ఒక్కో ఫారం రాయడానికి

బ్యాంకు వెలుపల విత్‌డ్రా ఫారాలు రాయించుకుంటున్న లబ్ధిదారులు

రూ.10-20 వసూలు చేశారు. రూ.50 చెల్లించుకున్నవారూ ఉన్నారు. ఈ ఖర్చులన్నీ పోను లబ్ధిదార్లకు చేతికి రూ.1800-2100 మధ్య వస్తున్నట్లు వాపోతున్నారు. విత్‌డ్రా ఫారాల అంశమై యూనియన్ బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించగా సిబ్బంది లేని కారణంగా ఓచర్లు రాసేందుకు ఎవర్నీ కేటాయించలేకపోయామని చెప్పారు. అయితే తాగునీరు, టెంట్లు తదితర సదుపాయాలను శుక్రవారం నుండి కల్పించామని చెప్పారు.

మహిళలకు ప్రతినెలా రూ.8333

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎం.రాధాకృష్ణ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఒకరు నవరత్నాలు, మరోకరు సూపర్ సిక్స్ అంటూ ప్రజల్ని మోసం చేస్తున్నారని ఇండియా వేదిక తరపున చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.రాధాకష్ణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని నెహ్రూ నగర్, కృష్ణమహల్ సెంటర్, గుర్రాలచావిడి తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్, సిపిఎం శ్రేణులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు ఇచ్చి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఇండియా వేదిక అధికారంలోకి వస్తే మహిళలకు ప్రతినెలా రూ.8333 ఇస్తామని, రైతులు, కార్మికులు అన్ని రకాలుగా మేలు చేసేలా విధానాలు అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్.లూథర్, ఎం.విల్సన్, టి.ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

పరిశీలకునికి వివరాలు చెబుతున్న ఆర్‌ఓ శ్యాంప్రసాద్

ఎన్నికల సిబ్బందికి శిక్షణపై పరిశీలన

ప్రజాశక్తి-మాచర్ల

పోలింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకుని ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని పల్నాడు జిల్లా ఎన్నికల పరిశీలకులు భురే సర్వేశ్వర్ నరేంద్ర అన్నారు. మాచర్ల ఎస్‌కెబిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీఓ, ఏపీవోలకు జరుగుతున్న శిక్షణను శనివారం ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. శిక్షణ తీరును మాచర్ల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ వివరించారు. పోలింగ్ రోజున పోలింగ్ సిబ్బందికి అందించే మెటీరియల్‌ను, పోలింగ్ జరిగే రోజుకు సంబంధించి సిఈఓ కార్యాలయం రూపొందించిన పిఓ, ఎపిఓ వీడియోల ప్రదర్శన, ఈవిఎం హాండ్స్ ఆన్ ట్రైనింగ్, పోలింగ్ రోజుకు సంబంధించిన పత్రాలు ఏ విధంగా పూర్తి చేయాలి తదితర అంశాల్లో శిక్షణిస్తున్నట్లు చెప్పారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సత్తెనపల్లి నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణ సూచించారు. సత్తెనపల్లి జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో పీఓ,ఏపీఓలకు రెండోవ

విడత శిక్షణను శనివారం నిర్వహించారు. ఈవీఎం, వీవీ ప్యాట్స్‌పై అవగాహన కల్పించారు. కంట్రోల్ యునిట్‌కు ఈవీఎంలు ఎలా అనుసంధానం చేయాలి, ఏయే ఫారాలు పూర్తి చేయాలి తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్స్ అవగాహన కల్పించారు.

ప్రతిఒక్కరూ శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి

ప్రజాశక్తి - యడ్లపాడు

పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన యడ్లపాడులోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూలులో కొద్దిరోజులు విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం 'శాస్త్రీయ ఆలోన' అంశంపై యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు వివరించారు. భావవాదం, భౌతిక వాదం మధ్య వ్యత్యాసాలపై ఉదాహరణలతో అవగాహన కల్పించారు. భౌతికవాదం ఎప్పుడూ నిజాన్ని కోరుకుంటుందని, మానవత్వాన్ని, సమానత్వాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. భావవాదం ప్రజల మధ్య చీలికలు తెస్తూ వైషమ్యాలను పెంచుతుందన్నారు. ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని, ప్రతి విషయాన్నీ తర్కబద్ధంగా ప్రశ్నించాలని సూచించారు. పరిశీలన, పరిశోధన ద్వారా వచ్చిన ఫలాలను సమాజానికి ఉపయోగించడమే సైన్స్ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో యడ్లపాడు అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షులు, దేవాదాయ శాఖ మాజీ డిప్యూటీ కమిషనర్ పోపూరి గంగయ్య చౌదరి, సభ్యులు ఎం.రవీంద్రబాబు, పిఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు

ప్రయోగాత్మకంగా వివరిస్తున్న ఎన్.వెంకటేశ్వర్లు

ఎన్.కాళిదాసు, నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ సృజన పాల్గొన్నారు.

నిజాయితీగా ఓటు వేయండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల్లో నీతి నిజాయితీతో ఓట్లు వేయాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ సత్తెనపల్లి అభ్యర్థి జొన్నలగడ్డ విజయ్ కుమార్ కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆదివారం నుండి జరగనున్న పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల ప్రలోభాలు, వత్తిడిలకు తలొగ్గకుండా నీతి నిజాయితీగా ఓటేయాలని ఓటర్లను కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బహుజన, అగ్రవర్ణాల్లో పేద కుటుంబాలకు చెందిన వారు తమ ఐక్యతను నిరూపించుకునే సమయం ఆసన్నమైందని, తనకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

వైసిపిని వీడి టిడిపిలోకి

ప్రజాశక్తి - పెదకూరపాడు : మండలంలోని పరస గ్రామ వైసిపి మండల అధ్యక్షులు పల్లప్రోలు వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు అమరనేని కోటేశ్వరరావు (కత్తి కోటయ్య) శనివారం ఆ పార్టీని వీడి టిడిపిలో చేరారు. నరసరావుపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో టిడిపి పెదకూరపాడు మండల అధ్యక్షులు ఎ.రమేష్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ ఎన్నికల్లో పరస గ్రామంలో అత్యధిక ఓట్లు ఎన్‌డిఎ కూటమి తరుపున పెదకూరపాడు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌కు కానుకగా అందిస్తామని పరస గ్రామ సర్పంచ్ ఎస్.వెంకటేశ్వర్లు (బాబు), పరస గ్రామ టిడిపి అధ్యక్షుడు పి.గంగాధర్‌రావు, మాజీ సర్పంచ్ ఎన్.నాగేశ్వరరావు, ఎ.రామకృష్ణ, ఎస్.శివకృష్ణ, ఎస్.శ్రీకాంత్, ఎస్.అమరయ్య, ఎస్.వెంకట శివరావు, ఎ.కొండలరావు అన్నారు. వారి వెంట మాజీ ఎంపీపీ జి.బాబు ఉన్నారు.

ఇండియా వేదికతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కాంగ్రెస్, వామపక్ష శ్రేణుల ప్రచారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బిజెపిని ఓడించడం ద్వారానే దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమవుతుందని దేశ, రాష్ట్ర భవిష్యత్తు ఇండియా వేదిక ద్వారానే గాడిన పడుతుందని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. ఈ ఎన్నికల్లో వేదిక అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇండియా వేదిక తరుపున నరసరావుపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ మహబూబ్ సుభాని విజయాన్ని కాంక్షిస్తూ శనివారం నరసరావుపేట పట్టణంలోని వెంగళరెడ్డి నగర్, వెంకటరెడ్డి నగర్, ఇస్లాంపేట ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభ్యర్థితో కలిసి సిపిఎం, సిపిఐ నాయకులు కరపత్రాలను ప్రజలకు పంచి ఓట్లు అభ్యర్థించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో అరాచక పాలన సాగిస్తున్న మోడీ మళ్లీ అధికారంలోకి వస్తే నియంతృత్వం రాజ్యమేలుతుందన్నారు. ఈ క్రమంలో దేశానికి, రాష్ట్రానికి ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు రక్షణ కవచమన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చేయడం కోసం మోడీ మరో అవకాశం అడుగుతున్నారని, బిజెపిని, ఎన్‌డిఎ కూటమిని తిరస్కరించాలని ప్రజలను కోరారు. నరసరావుపేట ఎమ్మెల్యేగా మహబూబ్ సుభానీని, ఎంపీగా అలెగ్జాండర్ సుధాకర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థి మహబూబ్ సుబాని మాట్లాడుతూ బిజెపి కేంద్రంలో మరోసారి అధికారంలోకి వస్తే మతోన్మాదం మరింత పెట్రేగుతుందని, రాజ్యాంగాన్నే మర్చేస్తారని చెప్పారు. మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తామని బిజెపి ఇప్పటికే ప్రకటించిందన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే భారతదేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. ప్రజలందరూ ఆలోచించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.మల్లీశ్వరి, ఫాతిమా, సిలార్ మసూద్, సుభాని, సిపిఐ నాయకులు యు.రంగయ్య, వి.వెంకట్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు : బిజెపిని దేశం నుండి తరిమికొట్టాల్సిన అవసరం ఉందని ఇండియా వేదిక తరుపున నరసరావుపేట పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ అన్నారు. శనివారం పెదకూరపాడులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వామక్షాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చడానికి బిజెపి యత్నిస్తోందని, మత విద్వేషాలు రెచ్చగొడుతోందని అన్నారు. ఆ పార్టీని ఓడించడంతోపాటు ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.గోపి, నియోజకవర్గ అధ్యక్షులు ఎం.ఉదయ్‌శంకర్, సిపిఐ నాయకులు శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ నాయకులు బి.సుభాని, కె.సుభాని పాల్గొన్నారు.

ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

ప్రతిఒక్కరూ ఓటేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతి ఒక్కరూ ఓటేసేలా ఓటర్ స్లీప్‌లు కూడా పంపిణీ చేయించామని, ఐదేళ్లకు ఒకసారి వేసే ఓటుపై ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా తమ హక్కును ఉపయోగించుకోవాలని పల్నాడు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద రోడ్డు సేఫ్టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'రండి ఓటు వేద్దాం - ఓటింగ్ శాతం పెంచుదాం' వాల్‌పోస్టర్లను కలెక్టర్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆడియోతో కూడిన సంచార ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఆర్.కె దుర్గా పద్మజ ఆధ్వర్యంలో కరపత్రాలు, బోర్డులు ఏర్పాటు చేయటంపై అభినందనలు తెలిపారు. మద్యం, డబ్బులు, బహుమతులు తీసుకోకుండా ఓటేయాలనే ప్రచారం మంచిదన్నారు. ఆర్. కె. దుర్గ పద్మజ మాట్లాడుతూ ప్రధానంగా అర్బన్ ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు ఓటు వేసే విషయంలో అశ్రద్ధ వహిస్తున్నారని, వారికి కరపత్రాలు పంపిణీ చేసి ఓటు హక్కు ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, రెవెన్యూ అధికారి వినాయకం, స్వచ్ఛంద సంస్థ సభ్యులు బంగారయ్య, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయిరాలు షేక్ మౌలాలి

బాయ్స్ హై స్కూల్ విద్యార్థులకు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక కొత్తపేట ఎస్ ఆర్ఎస్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల ఎన్సిసి విద్యార్థులు ప్రతి ఏటా అం దించే క్యాడేట్ వెల్ఫేర్ సొసైటీ జాతీయ స్కాలర్ షిప్ అవార్డులకు ఎంపికయ్యారు. తమ పాఠశాల క్యాడేట్స్ టి.హేమలత, షేక్ బుజ్జి, కె.వెంకట సాయి ఫణీంద్ర, పి.వశిష్ట లు ఎంపికైనందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాలి శనివారం విద్యార్థులను అభినందించారు. రూ 6 వేలు చెక్కులను 22వ ఆంధ్ర బెటాలియన్ సుబేదార్ మేజర్ మనోజ్ కుమార్ శని వారం బహుకరించినట్లు మౌలాలి తెలిపారు. క్రమశిక్షణ, నాయ కత్వ లక్షణాలు అలవర్చుకోవడంతోపాటు తగిన ప్రోత్సాహక బహుమతులను ఎన్సిసి అందిస్తుందని ఎన్‌సిసి అధికారి పరిశా సర్దార్ తెలియజేశారు. ఈ స్కాలర్‌షిప్‌లు కొత్తపేట బాయ్స్ హై స్కూల్ విద్యార్థులకు దక్కడం అభినందనీయమన్నారు.

మే డే కవితల పోటీ విజేత ఆళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి-తెనాలి

మే డే సందర్భంగా తెలంగాణా రాష్ట్రం, హైదరాబాద్‌కు చెందిన తెలుగు రాజ్యం కల్చరల్ ఫౌండేషన్ ఇరు తెలుగు రాష్ట్రాల స్థాయిలో గత నెల 29న 'నాయకుడంటే ఎలా ఉండాలి' అంశంపై ఆన్‌లైన్‌లో వచన కవితల పోటీ నిర్వహించారు. ఈ పోటీలలో పట్టణానికి చెందిన కవి, రచయిత ఆళ్ళ నాగేశ్వరరావు రచించిన 'అందరికీ ఆదర్శుడై ఉండాలి' శీర్షికన రాసిన కవితకు ప్రథమ బహుమతి లభించింది. ఈ విషయాన్ని ఆళ్ళ నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.1500 గెలుచు కున్నట్లు నిర్వాహక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గోపరాజు రవి వెల్లడించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆళ్ల నాగేశ్వరరావును పట్టణ సాహితీవేత్తలు, గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం, సిఐ సాంబశివ, కార్మికులు ,అధి కారులు అభినందించారు.

'మంత్రి పెద్దిరెడ్డి అనుచరుల దాడిని ఖండిస్తున్నాం'

మాట్లాడుతున్న బిసివై నాయకులు

ప్రజాశక్తి-మంగళగిరి

బిసివై రాష్ట్ర అధినేత బోడె రామ చంద్ర యాదవ్ పుంగనూరు నియోజక వర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వ హిస్తుండగా మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు తమ ప్రచార వాహనాల ధ్వంసాన్ని, రామచంద్ర యాదవ్‌పై చేసిన హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. శనివారం సాయంత్రం మంగళగిరి లోని బిసివై పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్ఎస్ యాదవ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేయొచ్చని, ప్రచారం చేసుకునే హక్కు ఉందని అన్నారు. తమ పార్టీ అధినేత ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు, రౌడీలు, గుండాలు దాడి చేసి పోలీస్ స్టేషన్ ఎదురుగానే తమ వాహనాలను దగ్ధం చేస్తుంటే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు వారు చేస్తే తమ పార్టీ అధినేత, తమ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టారని విమర్శించారు. ఈ సంఘటనపై ఎన్నికల కమిషన్ కి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తమ వారిపై అక్రమ కేసులను ఎత్తి వేయాలని, ఎన్నికల్లో ప్రచారం చేసుకునే అవకాశం తమకు కల్పించాలని తమ ఫిర్యాదులో పేర్కొనట్లు చెప్పారు. సమావేశంలో మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త టి.శివ రాం ప్రసాద్ యాదవ్, బిసివై పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.చాముండేశ్వరిదేవి, నాయకులు డి.శంకరరావు పాల్గొన్నారు.

ఎపిలో చిత్ర పరిశ్రమ అభివృద్ధి జరగాలి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఆంధ్రప్రదేశ్ లో సినీ పరిశ్రమ అభివృద్ధి పూర్తి స్థాయిలో జరగాలని సిని దర్శకులు సి. ఉమామహేశ్వం రావు అన్నారు. సిని దర్శకులు దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ శనివారం సినిమా దర్శకుల దినోత్సవ సంబరాలు నిర్వహించింది. మా ఎపి వ్యవస్థాపక అధ్యక్షులు, దర్శకులు దిలీప్ రాజా అధ్యక్షతన స్థానిక సుల్తానాబాద్ రత్న ఫార్ట్యూన్ కళ్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో దాసరి నారాయణరావు స్మారక పురష్కారాన్ని ఉమామహేశ్వరరావు, భరత్ పారేపల్లి అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దర్శకులు డాడీ శ్రీనివాస్, ఓం సాయి, బి.సోమసుందరం, చలవాది శివప్రసాద్ మా-ఎపి గౌరవ పురస్కారాన్ని అందుకున్నారు. వర్ధమాన హీరోయిన్లు దివిజ, మౌనిక రెడ్డి, టీనా చౌదరిలను డాక్టర్ కొత్తమాసు శ్యామ్ ప్రసాద్ సత్కరించారు.

అనంతరం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సినిమాల రూపకల్పనకు నూతన దర్శకులు ప్రయత్నాలు చేయాలన్నారు. రేపటి తరం వారసులకు నూతన దర్శకుల చిత్రాలు మార్గదర్శకాలు కావాలన్నారు. దిలీప్

దర్శకులు ఉమామహేశ్వరరావు, భరత్ పారేపల్లి ను సత్కరిస్తున్న డాక్టర్ కొత్తమాసు శ్యామ్ ప్రసాద్, దర్శకులు దిలీప్ రాజా

రాజా మాట్లాడుతూ వర్తమాన దర్శకులు నిర్మించబోయే చిత్రాల్లో ఎపి నటీ నటులకు అవకాశం కల్పించాలని కోరారు. ఎపి ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ మేనేజరు శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో సినిమాలు చిత్రీకరణకు అనువైన లొకేషన్లను ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని తెలిపారు. షూటింగుల నిర్వహణకు దర్శకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. తొలుత చిన్నారి గ్రీష్మ శ్రీ ప్రదర్శించిన భరతనాట్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఐనంపూడి శరత్ బాబు దర్శక దినోత్సవ ప్రత్యేక గీతాన్ని ఆలపించారు.కారక్రమంలో దర్శకుడు కనపర్తి రత్నాకర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలుపునకు బాటలు

మాట్లాడుతున్న అన్నాబత్తుని శివకుమార్

ప్రజాశక్తి-కొల్లిపర

రాష్ట్ర ప్రజల కోసం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే తమ గెలుపునకు బాటలు వేశాయని తెనాలి నియోజకవర్గ వైసిపి అభ్యర్థి అన్నా బత్తుని శివకుమార్ అన్నారు శనివారం మండల కేంద్రం కొల్లిపరలోని పాలకేంద్రంకళ్యాణ మండపంలో జరిగిన 'జగన్ కోసం సిద్ధం ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలం లోని నాయ కులకు, గృహ సారథులకు జేసిఎస్ కన్వీనర్లకు రాబోయే ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు జననేత జగన్ వెంటే ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు ఎం.శేషగిరిరావు, జి.చిన్న వెంకటరెడ్డి, ఆర్య చంద్రారెడ్డి, అవుట్ కృష్ణారెడ్డి, మండల వైసిపి అధ్యక్షులు అవుతూ పోతిరెడ్డి పాల్గొన్నారు

మురుగుడు లావణ్య ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి వైసిపి అభ్యర్థి మురుగుడు లావణ్య శనివారం మంగళగిరి పట్టణంలోని ఎల్బీ నగర్, ఇప్పటం రోడ్డు ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైసిపినాయకులు మురుగుడు సత్యం, ఎం.సుధారాణి, ఎ.రాజేష్ పాల్గొన్నారు.

1600వ రోజుకు అమరావతి మహోద్యమం

ప్రజాశక్తి - తుళ్లూరు

మూడు రాజధానులకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన అమరావతి మహోద్యమం శనివారం నాటికి 1600వ రోజుకు చేరింది.రాజధాని నిర్మాణానికి 29 గ్రామాలకు చెందిన 29,514 మంది రైతులు 34 వేల 415 ఎకరాల భూమిని ఇచ్చారు.ఎన్నికలలో గెలిచి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం చేసిన మూడు రాజధానుల ప్రకటనకు వ్యతిరేకంగా రైతులు, మహిళలు, రైతు కూలీలు ఉద్యమం బాట పట్టారు. ఉద్యమానికి వైసిపి మినహా అన్ని రాజకీయ పక్షాలు మద్దతుగా నిలిచాయి. నిర్బంధాలు, కేసులు,ఉద్యమంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపినా వెరవకుండా రైతులు,మహిళలు 1600 రోజులుగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఉద్యమం 1600 వ రోజుకు చేరడాన్ని పురస్కరించుకుని తుళ్లూరు, వెంకటపాలెం, మందడం,అనంతవరం, దొండపాడు తదితర గ్రామాల్లో రైతులు,మహిళలు,రైతు కూలీలు ఆందోళనలు చేపట్టారు. నేలపాడు దగ్గర ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల భవన సముదాయాల వద్ద రైతులు,మహిళలు వైసిపి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రజాధనంతో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయని నిరసన తెలిపారు. అమరులైన 272 మంది రైతులకు నివాళి అర్పించారు. రైతులు, మహి ళలతో పాటు చిన్నారులు నిర సన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్ల కార్డు లు చేతబట్టి ' జై అమ రావతి' అంటూ నినాదాలు చేశారు.

నేలపాడులోని ఉద్యోగుల భవన సముదాయాల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

ప్ల కార్డుతో ఓ చిన్నారి

ప్రచారం నిర్వహిస్తున్న పెమ్మసాని రత్న, నాదెండ్ల మనోహరం

కొల్లిపర మండలంలో ప్రచారం

ప్రజాశక్తి - కొల్లిపర

అభివృద్ధి, ప్రజా సంక్షేమం తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి కూటమి ఉమ్మడి లక్ష్యమని గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ భార్య పెమ్మసాని రత్న అన్నారు. శనివారం తెనాలి నియోజకవర్గ కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ భార్య నాదెండ్ల మనోహరంతో కలసి కొల్లిపర మండలంలోని అన్నవరం గౌడ్ పాలెం, ఎస్సీ కాలనీ, హనుమాన్ పాలెం, దావులూరుపాలెంలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రత్న మాట్లాడుతూ అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని లక్ష్యంతో సూపర్ సిక్స్ పథకాలను తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిం దన్నారు. మనోహరం మాట్లాడుతూ మనోహర్‌ను, చంద్రశేఖర్‌లకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు అచ్యుత సాంబశివ రావు శనివారం ప్రకటన విడుదల చేశారు. గుండె, ఎముకలు, కిడ్నీ, సాధారణ సమ స్యలపై గుంటూరు వేదాంత హాస్పిటల్స్ వైద్య నిపుణుల బందం శిబిరంలో పాల్గొంటారని ప్రాజెక్టు చైర్మన్ గుండా రామకోటేశ్వర రావు వెల్లడించారు. కిడ్నీ, గుండె, ఆర్థోపెడిక్ సమస్యలపై అనుభవజ్ఞులైన డాక్టర్లు వైద్యం అందించనున్నారని తెలిపారు. ఆరోగ్య సమస్యలపై తలపెట్టిన ఉచిత మెగా వైద్య శిబిరం ద్వారా తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోగలరని పట్టణ ప్రజలను కోరారు.

'హార్వెస్ట్ ఇండియా' పేరిట మోసాలు: వైసిపి

ప్రజాశక్తి - తుళ్లూరు

కత్తెర హెనీ క్రిస్టినా,సురేష్ కుమార్ దంపతులను టిడిపిలో చేర్చుకోవడం చంద్రబాబు దిగజారుడుతనానికి నిదర్శనమని వైసిపి నేత బరిగల కోటేశ్వరరావు విమర్శించారు. శనివారం స్థానిక హెచ్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో మీడియాతో మాట్లాడుతూ, కత్తెర సురేష్ దంపతులపై ఆయన విరుచుకుపడ్డారు. హార్వెస్ట్ ఇండియా సంస్థ పేరిట సురేష్ కుమార్ ఎన్నో మోసాలు చేశాడని, వాటిని కప్పిపుచ్చుకునేందుకే టిడిపిలో చేరారని ఆరోపించారు. కులం,సంతానం విషయంలో తప్పుడు అఫిడవిట్ ఇచ్చి ఎన్నికల్లో పోటీ చేశారని ఆరోపించారు. హెనీ క్రిస్టినా తక్షణమే జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిరూపించేందుకు సాక్ష్యాలతో తాను సిద్ధంగా ఉన్నానని, కత్తెర దంపతులతో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

తాడికొండలో ఎఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి-తాడికొండ

బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా ఆంధ్ర రాష్ట్ర సమితి పనిచేస్తుందని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు అన్నారు. ఎఆర్ఎస్ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పటాన్ బాషా,తాడికొండ నియోజకవర్గ అభ్యర్థి మెండం మరియదాసు విజయాన్ని కోరుతూ శనివారం నిడుముక్కల, తాడికొండలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో రెండు సామాజిక వర్గాలే తమ పాలనను కొనసాగిస్తున్నాయని అన్నారు. బహుజనులు ఓటు బ్యాంకుగానే ఉండాలా అని నిలదీశారు. పేదలను ఆదుకోవటమే తమ పార్టీ లక్ష్యమన్నారు. రాజధానిపై రెండు పార్టీలు దొంగ నాటకాలు ఆడుతున్నాయని ధ్వజమెత్తారు.

అమరావతి జెఎసి సమన్వయ కమిటీ సభ్యుల ప్రచారం

ప్రజాశక్తి - కొల్లిపర

తెనాలి నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యరి నాదెండ్ల మనోహర్‌కు, గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మ సాని చంద్రశేఖర్‌కు ఓట్లు వేసి గెలిపించాలని అమరావతి జేఏసీ సమన్వయ కమిటీ సభ్యులు కోరారు. అమరావతి రైతులు 1600వ రోజు ఉద్యమాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన కొల్లిపరలో శనివారం అమరావతి నుంచి వచ్చిన జేఏసీ సమన్వయ కమిటీ సభ్యులు గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో అమరావతి జేఏసీ సమన్వయ కమిటీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, జొన్నల కిరణ్, అనిత, స్వర్ణ బిందు పాల్గొన్నారు.

నేటి నుండి పోస్టల్ బ్యాలెట్ వారికి పోలింగ్

రిటర్నింగ్ అధికారి జెసి శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - మాచర్ల

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధులలో పాల్గొనే అధికారులు, సిబ్బంది తప్పని సరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి, పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేది నుండి 7వ తేదీ వరకు జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో పోస్టల్ బ్యాలెట్ జాబితాలో పేరున్న వారి కోసం పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి పోస్టల్ బ్యాలెట్ ఉన్న వారు అందరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 5న పోలింగ్ అధికారులు, సహయ పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 6న ఎన్నికల విధుల్లో పాల్గొనే డ్రైవర్లు, క్లీనర్లు, వీడియో గ్రాఫర్స్, అత్యవసర సర్వీసులలో పనిచేసే 33 శాఖల వారు తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలన్నారు. 7న పోలీసు సిబ్బంది ఓటు హక్కుని వినియోగించుకోవాలని ఆర్ ఓ కోరారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవచ్చునని తెలిపారు.

ఏప్రిల్ పెన్షన్ విడుదలకు అనుమతి

ప్రజాశక్తి-గుంటూరు

ట్రెజరీ డైరెక్టర్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్న నాయకులు

లైఫ్ సర్టిఫికెట్లు ఇచ్చిన వారందరికీ ఏప్రిల్ నెల పెన్షన్ విడుదలకు అనుమతి మంజూరు చేస్తూ ట్రెజరీ శాఖకు ఆదేశాలు ఇచ్చి, బిల్లులు సిఎఫ్ఎంఎస్‌కు పంపటానికి సహకరించిన ట్రెజరీ సంచాలకులు ఎన్.మోహనరావుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్ నెలల్లో లైఫ్ సర్టిఫికెట్లు ఉప ఖజానా కార్యాలయానికి స్వయంగా వచ్చి ఇచ్చిన పెన్షనర్లకు వేలిముద్రలు పడలేదని, సాంకేతిక కారణంతో సిఎఫ్ఎంఎస్ వారు అప్లోడ్ చేయటానికి అనుమతించని కారణంగా, పెన్షనర్లు వారి లైఫ్ సర్టిఫికెట్లు మాన్యువల్‌గా సమర్పించినా కూడా సాంకేతిక కారణాలతో ఏప్రిల్ నెల పెన్షన్ విడుదల కాలేదని తెలిపారు. దీంతో అసోసియేషన్ నాయకులు ట్రెజరీ డైరెక్టర్‌ను కలిసి లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించిన వారందరికీ పెన్షన్ విడుదల చేయాలని కోరామని, డైరెక్టర్ సానుకూలంగా స్పందించి ఏప్రిల్ నెల పెన్షన్‌కు విడుదలకు అనుమతి ఇచ్చారని తెలిపారు. ట్రెజరీ డైరెక్టర్‌ను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రి, ట్రెజరర్ నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు లవకుమార్, నారాయణరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ కాలేజి ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

హైదరాబాద్, బేగంపేటలోని ప్లాజా హోటల్లో ఐఈఈఈ, ఐఈఎస్, స్టూడెంట్ అండ్ యంగ్ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్-2014 నిర్వహిస్తున్నట్లు ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సదస్సుకు సంబంధించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను, వెబ్‌సైట్‌ను, పోస్టర్లను శుక్రవారం కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీస్: అవకాశాలు, సవాళ్లు, పరిష్కారాలు' అనే అంశంపై ఈ అంతర్జాతీయ సదస్సు జరుగుతుందన్నారు. స్మార్ట్‌గ్రిడ్, ఇండస్ట్రీ 4.0, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్, ఇతర అత్యాధునిక సాంకేతికతల వల్ల వచ్చే లాభాలు, ఉపయోగాలపై చర్చలు జరుగుతాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ సదస్సులో పాల్గొనదలచిన విద్యార్థులు పేర్లు నమోదు కోసం **http//syp.ieee-ies.org/** వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, నిర్వహణ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పి.త్రిపుర తదితరులు పాల్గొన్నారు.

చలపతిలో గ్లాండ్ ఫార్మా ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-గుంటూరు :లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో శనివారం హైదరాబాద్‌కు చెందిన గ్లాండ్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ వారు బి.ఫార్మసీ, యం.ఫార్మసీ విద్యార్థులకు ప్రొడక్షన్ అండ్ ఇన్‌ప్రాసెస్ క్వాలిటీ అస్యూరెన్స్ విభాగంలో ఉద్యోగానికి ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. కంపెనీ హెచ్ఆర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శాంతికిరణ్, ప్రొడక్షన్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీమన్నారాయణ, ప్రొడక్షన్ సీనియర్ మేనేజర్ రాజేంద్ర, ప్రొడక్షన్ మేనేజర్ వంశీకృష్ణమ్‌రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో 70 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో 33 మంది ఉద్యోగార్హత సాధించారని తెలిపారు. ఎంపికైన వారు రూ.2.1 లక్షల నుండి రూ.2.2 లక్షల వార్షిక వేతనం పొందుతారని అన్నారు. ఉద్యోగా లకు ఎంపికైన వారికి చలపతి విద్యా సంస్థల ఛైర్మన్ వై.వి.ఆంజ నేయులు, ప్రిన్సిపాల్ రామారావు తదితరులు అభినంద నలు తెలిపారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు కంపెనీ ప్రతినిధులు

మోడీకి ఓటమి భయం పట్టుకుంది

మాట్లాడుతున్న అజీజ్‌పాషా

ప్రజాశక్తి-గుంటూరు

దేశవ్యాప్తంగా ఇప్పటి వరకూ జరిగిన పోలింగ్ సరళితో ఓటమి తప్పదనే భయం బిజెపికి పట్టుకుందని, దీంతో హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ది పొందటానికి కుట్ర చేస్తున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి అజీజ్ పాషా అన్నారు. ఇండియా వేదిక గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ ఇన్సాఫ్, ఆవాజ్ సంఘాల ఆధ్వర్యంలో కొత్తపేట, మల్లయ్యలింగం భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఇప్టా జాతీయ కార్యదర్శి గని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అజీజ్‌పాషా మాట్లాడుతూ ఈసారి 400 సీట్లు గెలుస్తామని గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని చెప్పారు. బిజెపికి 200 సీట్లకు మించి వచ్చే పరిస్థితి లేదన్నారు. మోడీ ప్రచారంలో ఎక్కడా దేశ ఆర్థిక విధానాలు, నిరుద్యోగం వంటి అంశాలు మాట్లాడట్లేదని, హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెడితే ఎక్కువ ఓట్లు వస్తాయని భావిస్తున్నారన్నారు. వ్యవసాయ ఎగుమతులు గతంలో 10.05 శాతం ఉంటే ఇప్పుడు 2.2 శాతానికి పడిపోయిందని, ఏ అంశంలోనూ భారత దేశం అభివృద్ధి చెందిన దేశాల సరసన లేదన్నారు. 2014లో రేట్ ఆఫ్ గ్రోత్ 186 ఉంటే ఇప్పుడు అది 86కి పడిపోయిందన్నారు. అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ మాట్లాడుతూ మోడీ పాలనలో మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఎన్నికలు ఫాసిస్టు మనువాద భావజాలానికి, వామపక్ష భావజాలానికి మధ్య జరుగుతున్న ఎన్నికలని అన్నారు. దేశ ప్రధానిగా ఎన్నికల్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేయటం సరికాదన్నారు. గత పదేళ్లలో దేశంలో చోటు చేసుకున్న మారణ హోమాల కారణంగా తెగిపోయిన మంగళసూత్రాలు మోడికి కనిపించకపోవటం శోచనీయం అన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, వైసిపి బిజెపికి తొత్తులుగా మారాయన్నారు. కావున దేశంలో ప్రజాస్వామ్యం, లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(శరత్‌పవార్ గ్రూపు) మైనార్టీ విభాగం జాతీయ ఉపాధ్యక్షులు జమీల్ అహ్మద్‌బేగ్, సిపిఐ నగర కార్యదర్శి కె.మల్యాద్రి ప్రసంగించారు.

ఆటోనగర్‌లో సమస్యలు పరిష్కరిస్తాం : ముస్తఫా

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ముస్తాఫా

ఆటోనగర్‌లోవ్యాపారులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని గుంటూరు లోక్‌సభ వైసిపి అభ్యర్థి కిలారి రోశయ్య చెప్పారు. గుంటూరు ఆటో నగర్ వివిధ అసోసియేషన్ వ్యాపార, కార్మికుల సంఘాల ప్రతినిధులు ఆత్మీయ సమావేశంలో తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమాతో కలిసి రోశయ్య పాల్గొన్నారు. రోశయ్య మాట్లాడుతూ ఆటోనగర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ గుంటూరు ఆటో నగర్ ఇప్పటికే అభివద్ధి చెందిందని రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థాయిలో ఉంచేందుకు శక్తివంచన లేకుండా కషి చేస్తామని తెలిపారు.. రానున్న ఎన్నికల్లో విద్యావంతురాలైన తన కుమార్తె నూరిఫాతిమాను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తుందని తన గెలుపు కోసం కషి చేయాలని ఆయన కోరారు. నూరిఫాతిమ మాట్లాడుతూ జగనన్న అన్నీ వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారని బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. ఆటో నగర్ లో ఉన్న ప్రతీ కార్మిక సోదర కుటుంబానికి తను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.. రానున్న ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గన్ని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కషి చేయాలని ఆమె కోరారు. వైసిపి నాయకులు గులాం రసూల్, జియా ఉర్ రెహమాన్, నెర్రెళ్ల సురేష్, యడ్ల నాగమల్లేశ్వరరావు, అట్లాస్ రహంతుల్లా తదితరులు ప్రసంగించారు. తూర్పు నియోజకవర్గంలోని 17వ డివిజన్ గాంధీ నగర్ మరియు చాకలి గుంట వద్ద స్థానికకార్పొరేటర్ ఫర్జాన ఇతర ముఖ్య నాయకులతో కలసి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరిఫాతిమా పాల్గొన్నారు. మహిళలకు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవాడి గడపకు సంక్షేమం అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. వివిధ పేద వర్గాల అభ్యున్నతకు కషి చేసిన సీఎంను రానున్న ఎన్నికల్లో రెండోసారి ముఖ్యమంత్రి చేసుకునేందుకు ప్రతి ఒక్కరు కషి చేయాలని ఆమె కోరారు అనంతరం వార్డులోని ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు అమలు లబ్ధి పొందిన లబ్ధిదారులకు వివరించారు

అభ్యర్థుల ఉరుకులు పరుగులు

7 వీక్షణం

గుంటూరు,పల్నాడు జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఉధృతంగా జరుగుతోంది. మరో వారం రోజుల్లో ప్రచార పర్వం ముగియనుంది. దీంతో అభ్యర్థులు ఇంటింటి ప్రచారం, వీధుల్లో సభలు, సమావేశాలు, ఆత్మీయ భేటీలను వేగిరపర్చారు. పార్లమెంటు అభ్యర్థులు ఉదయం ఏడు గంటల కల్లా ప్రచారంలోకి వెళ్తున్నారు. అసెంబ్లీ అభ్యర్థులు ఉదయం 8 గంటల కల్లా గ్రామాలు, వార్డుల్లోకి పరుగులుపెడుతున్నారు. ఎండ తీవ్రతవల్ల మధ్యాహ్నం 2 గంటల నుంచి నాలుగు గంటల మధ్య కొంత మంది విశ్రాంతి తీసుకుంటున్నారు. రాత్రి 10 గంటలకు ప్రచారం ముగించుకుని ఆ తరువాత సామాజిక వర్గాలు, కుల సంఘం నాయకులతో మంతనాలు చేస్తున్నారు.

ప్రత్యర్థుల కదలికలను గమనిస్తూ పలు ఎత్తుగడలను రూపొందిస్తున్నారు. టిడిపి, వైసిపి ఇతర పార్టీలకు చెందిన వారిని తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లో ప్రభావితం చేసే నేతలను తమ వైపునకు తిప్పుకునేందుకు వారి వివిధ రూపాల్లో ఆశలు చూపిస్తున్నారు. జనసేన, టిడిపి వారికి వైసిపి వారు గాలం వేస్తున్నారు. వైసిపికి వారికి టిడిపి వారు పాచికలు వేస్తున్నారు. ఈ సందర్భంగా రూ.లక్షల్లో చేతులు మారుతున్నాయి. అధికార పార్టీలో పదవులు పొందిన అనేక మంది ఇప్పటికే టిడిపిలో చేరారు. టిడిపిలో వివిధ హోదాల్లోఉన్నవారు వైసిపిలోకి వెళ్తున్నారు. అభ్యర్థులు తమ అనుచరుల ద్వారా 100 మంది ఓటర్లను మ్యానేజ్‌చేయగలిన వారిని ఇట్టే ఆకర్షిస్తున్నారు. గంపగుత్తగా తమకే ఓట్లు వేయాలని మీకేం కావాలో చెప్పండని బేరసారాలు చేస్తున్నారు. ఆత్మీయ సమావేశాల

పార్టీలోకి కొత్తనేతలను ఆహ్వానిస్తున్నారు. కొద్ది మంది అనుచరులు ,పార్టీ కార్యకర్తలు, రాజకీయ కూలీలతో కలిసి బృందాలుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గుంటూరు లోక్‌సభకు టిడిపి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రచారంలో ముందంజలో ఉన్నారు. వైసిపి అభ్యర్థి కిలారి రోశయ్య ఆలస్యంగా ప్రచారం ప్రారంభించడం వల్ల ఆయన ఇప్పటికీ చాలా గ్రామాలు వెళ్లని పరిస్థితి నెలకొంది. ఇండియా బ్లాక్ తరుపున సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ ఉధృతంగా ప్రచారం చేస్తున్నారు.

నర్సరావుపేటలోక్‌సభ పరిధిలో టిడిపి అభ్యర్థి లావు కృష్ణదేవరాయులు, వైసిపి అభ్యర్థి పి.అనిల్‌కుమార్ పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో వీరి ప్రచారం కొనసాగుతోంది.

ఎన్‌డిఏ తొలి ప్రచార సభ మార్చి 17న చిలకలూరిపేటలో జరిగింది. ప్రధాని మోడీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఈ సభలో పాల్గొన్నారు.

వైసిపి తరుపున ఇప్పటికే సిఎం జగన్ తొలి విడత బస్సు యాత్ర నిర్వహించారు. రెండో విడత ఇప్పటికే పొన్నూరు, క్రోసూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. టిడిపి తరుపున పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఇప్పటికే గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ, పొన్నూరు, తాడికొండ, పత్తిపాడు, గురజాల,పెదకూరపాడు, సత్తెనపల్లి, తెనాలి నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. పవన్ కల్యాణ్ తెనాలిలో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఇండియా బ్లాక్ తరుపున పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెనాలి, సత్తెనపల్లి, గుంటూరులో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. మంగళగిరి నుంచి ఇండియా బ్లాక్ తరుపున సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకర్ తరుపున ఇప్పటికే సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు ప్రచారం చేశారు. ఈనెల 8న తాడేపల్లిలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటున్నారు. **(ఎవిడి శర్మ)**